తెలంగాణ

TELANGANA MUCHATLU

ముచ్చట్లు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | సోమవారం - 28 - సెప్టెంబర్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 115 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# ప్యారడైజ్‌పై కేటీఆర్ ప్రశంసలు

- నాని, ప్రియదర్శి నటనకు అభినందనలు.. సామాజిక మాధ్యమ వేదికగా స్పందించిన కేటీఆర్
- కృతజ్ఞతలు తెలిపిన ప్రియదర్శి.. ఆసక్తికరంగా మారిన ఇద్దరి సంభాషణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**

నాని ప్రధాన పాత్రలో నటించిన 'ప్యారడైజ్' చిత్రంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. చిత్ర కథ, నటీనటుల ప్రదర్శన తనను ఆకట్టుకున్నాయని పేర్కొంటూ సామాజిక మాధ్యమ వేదికగా అభినందనలు తెలిపారు. ముఖ్యంగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నటుడు నాని, ప్రియదర్శిలను ప్రత్యేకంగా ప్రశంసించారు. చిత్రాన్ని వీక్షించిన అనంతరం కేటీఆర్ తన అభిప్రాయాన్ని పంచుకుంటూ ఆత్మగౌరవ పోరాటం, అణచివేతకు వ్యతిరేకంగా తిరుగుబాటు వంటి అంశాలను బలంగా చూపించిన చిత్రంగా అభివర్ణించారు. అవసరమైతే సామాన్య ప్రజలు కూడా అసాధారణ శక్తిగా మారగలరనే సందేశాన్ని సినిమా అందించిందని పేర్కొన్నారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ప్రధాన పాత్రలో నటించిన నాని తన పాత్రలో పూర్తిగా లీనమై నటించారని కేటీఆర్ కొనియాడారు. కథను ప్రేక్షకుల హృదయాలకు చేరవేయడంలో నటీనటుల

మిగతా 2 లో..

# పట్టభద్రులు ఓటరు నమోదులో ముందుండాలి

- నార్సింగిలో పట్టభద్రుల సమ్మేళనం – 2026 కార్యక్రమం
- ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం
- పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- ప్రజాస్వామ్య బలోపేతానికి యువతకు పిలుపు



**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**

నార్సింగిలో నిర్వహించిన పట్టభద్రుల సమ్మేళనం - 2026 కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు సంబంధించిన పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విద్యావంతుల పాత్ర ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు. సమాజంలోని విద్యావంతుల ఆలోచనలు, సూచనలు ప్రజా విధానాల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అందుకే ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి పట్టభద్రుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావచ్చని మంత్రి తెలిపారు. యువత, ఉద్యోగులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న పట్టభద్రులు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి నమోదు ప్రక్రియలో పాల్గొనాలని కోరారు. ప్రతి ఓటు విలువైనదేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, చేవెళ్ల కాంగ్రెస్ ఇంచార్జి భీమ్ భరత్, నైనా జైస్వాల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పట్టభద్రులతో నేరుగా మాట్లాడి ఓటరు నమోదుకు సంబంధించిన వివరాలను వివరించారు. అర్హతలు, అవసరమైన ధ్రువపత్రాలు, దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు చెందిన పెద్ద సంఖ్యలో పట్టభద్రులు కార్యక్రమానికి హాజరయ్యారు. విద్య, ఉపాధి, ప్రజాస్వామ్యంలో యువత భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చించారు. ఓటరు నమోదు ప్రక్రియను మరింత విస్తృతంగా చేపట్టాలని పలువురు అభిప్రాయపడ్డారు. రానున్న పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చే లక్ష్యంతో కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. విద్యావంతుల భాగస్వామ్యంతో ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.



# రొమ్ము క్యాన్సర్ అవగాహన ర్యాలీకి శ్రీకారం

- హైదరాబాద్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమం ప్రారంభించిన మంత్రి సీతక్క
- ముందస్తు గుర్తింపుతో పూర్తిగా నయం చేసే అవకాశం
- మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచన

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**

రొమ్ము క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహించిన అవగాహన ర్యాలీని మంత్రి సీతక్క ప్రారంభించారు. మహిళల్లో ఈ వ్యాధిపై అవగాహన పెరగడం, ముందస్తు నిర్ధారణకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని ఆమె పేర్కొన్నారు. రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని మంత్రి తెలిపారు. అందుకే మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్యల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. అనుమానాస్పద లక్షణాలు కనిపించినప్పుడు వాటిని చిన్న చూపు చూడకుండా తక్షణమే వైద్య సలహా తీసుకోవడం ఎంతో ముఖ్యమని సీతక్క అన్నారు. సమయానికి చికిత్స ప్రారంభిస్తే వ్యాధిని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు కూడా మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు. రొమ్ము క్యాన్సర్‌పై అపోహలను తొలగించి సరైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆమె సూచించారు. ఆరోగ్య సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో మహిళలు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, ముందస్తు పరీక్షల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్యకర జీవనశైలి, క్రమబద్ధమైన వైద్య పరీక్షల అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను మంత్రి సీతక్క అభినందించారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంచేందుకు వారి కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఆరోగ్య అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.



# కాంగ్రెస్ బీఎల్ఏలే పార్టీకి మూలస్తంభాలు

- నాగులవంచలో బీఎల్ఏల ఆత్మీయ సమావేశం
- ప్రజా సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చిన : భట్టి
- రూ.10 లక్షలకు పెంచిన ఆరోగ్యశ్రీ పరిమితి

2 లో..



# ఎస్టీ కోటాలో ఎంబిబిఎస్ సీట్లు పొందిన 37 మందికి షాక్!

- తెలంగాణ రిజర్వేషన్ వర్తించదన్న గిరిజన సంక్షేమ శాఖ
- 9 మంది ఎంబీబీఎస్ సీట్లు రద్దు.. మూడో దశ కౌన్సెలింగ్‌లోకి
- 37 మందినీ ఓపెన్ కేటగిరీలో పరిగణించనున్న కాళోజీ వర్సిటీ

8 లో..




# ఘనంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

- రవీంద్రభారతిలో నిర్వహించిన 111వ జయంతి కార్యక్రమం
- పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి
- బాపూజీ సేవలను స్మరించిన నాయకులు
- హాజరైన ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల నేతలు

2 లో..

# 8 వేల ఎకరాల భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- నేతన్నలు, రైతులు, విద్యార్థుల సమస్యలపై సమాధానం కోరిన కేటీఆర్
- హామీల అమలుకు స్పష్టమైన తేదీలు ప్రకటించాలని విజ్ఞప్తి
- సిరిసిల్ల అభివృద్ధిపై ప్రభుత్వం వివరాలు వెల్లడించాలని డిమాండ్



2 లో..

# మేడారం మినీ జాతర తేదీలు ఖరారు!

- ఫిబ్రవరి 17 నుంచి 20 వరకు సమ్మక్క–సారలమ్మ జాతర
- వనదేవతల దర్శనానికి భారీగా తరలిరానున్న భక్తులు

**ములుగు జిల్లా, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడారం సమ్మక్క-సారలమ్మ మినీ జాతర తేదీలు ఖరారయ్యాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో 2027 ఫిబ్రవరి 17 నుంచి 20వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మినీ జాతర నిర్వహించనున్నారు. ఈ మేరకు మేడారం పూజారులు తేదీలను ప్రకటించినట్లు సమాచారం. మినీ జాతర సందర్భంగా సమ్మక్క-సారలమ్మ వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు మేడారం తరలివచ్చే అవకాశం ఉంది.





మిగతా 2 లో..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఘనంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సహచర మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి కార్యక్రమంలో పాల్గొని బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాపూజీ తెలంగాణ సమాజానికి అందించిన సేవలను నాయకులు స్మరించారు. సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, ప్రజా హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉందని కొనియాడారు.




మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బాపూజీ జీవితం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో బాపూజీ పాత్ర ఎంతో విశిష్టమని అన్నారు. ప్రజా సంక్షేమం, సామాజిక చైతన్యం కోసం ఆయన చూపిన మార్గం తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. యువత ఆయన జీవితాన్ని అధ్యయనం చేసి స్ఫూర్తి పొందాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు గూడూరి శ్రీనివాస్, అనిల్ ఈరవర్తి, మెట్టు సాయికుమార్, బీసీ సంఘం నాయకుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. బాపూజీ సేవలను గుర్తుచేసుకుంటూ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, సామాజిక వర్గాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆయన చూపిన మార్గం ప్రజా సేవకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# ప్యారడైజ్‌పై కేటీఆర్ ప్రశంసలు

(మొదటి పేజీ తరువాయి)

కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. చిత్ర బృందం మొత్తం విజయానికి అర్హులని అభిప్రాయపడ్డారు. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలపై నటుడు ప్రియదర్శి స్పందించారు. తన సినీ ప్రయాణంలో ప్రారంభ దశ నుంచి ఇప్పటి వరకు తన సినిమాలపై కేటీఆర్ చూపిస్తున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై చూపుతున్న ప్రేమ, ప్రోత్సాహం మరింత బాధ్యతను పెంచుతుందని పేర్కొన్నారు.శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ప్రియదర్శి 'శంకరన్న' పాత్రను పోషించారు. ఈ పాత్రలో ఆయన నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. పాత్ర రూపకల్పన, సంభాషణలు, హావభావాలు సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీశాయి. అయితే ఈ పాత్రను కొందరు తెలంగాణ రాజకీయాలతో అనుసంధానం చేస్తూ వ్యాఖ్యానిస్తున్నప్పటికీ, ఇది పూర్తిగా కల్పిత కథ ఆధారంగా రూపొందించిన పాత్రేనని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ చేసిన ప్రశంసలు, ప్రియదర్శి ఇచ్చిన స్పందన సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారితీస్తున్నాయి.

# ఎస్టీ కోటాలో ఎంబిబిఎస్ సీట్లు పొందిన 37 మందికి షాక్!

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** వైద్య ప్రవేశాల ప్రక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ ఎస్టీ రిజర్వేషన్ ప్రయోజనం పొందేందుకు అర్హత లేదని గిరిజన సంక్షేమ శాఖ నివేదిక ఇవ్వడంతో 37 మంది అభ్యర్థులను ఎస్టీ కేటగిరీ నుంచి తొలగిస్తూ కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్ణయం తీసుకుంది. వీరిలో కొందరి కుటుంబాలు తెలంగాణేతర ప్రాంతాల నుంచి రాష్ట్రానికి వలస వచ్చినట్లు గిరిజన సంక్షేమ శాఖ పరిశీలనలో తేలినట్లు నివేదికలో పేర్కొంది. కుటుంబాల పూర్వ నివాస ప్రాంతాలు, వలస నేపథ్యం, తెలంగాణ రాష్ట్ర ఎస్టీ రిజర్వేషన్ ప్రయోజనాలకు సంబంధించిన నిబంధనలను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సెప్టెంబర్ 22న గిరిజన సంక్షేమ శాఖ 37 మంది అభ్యర్థుల వివరాలను విశ్వవిద్యాలయానికి పంపింది. ఆ నివేదిక ఆధారంగా 2026-27 ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో వారిని ఎస్టీ కేటగిరీగా కాకుండా ఓపెన్ కేటగిరీలో పరిగణించాలని వర్సిటీ ఉత్తర్వులు జారీ చేసింది.

**ఎస్టీ సర్టిఫికెట్ ఉన్నా.. రిజర్వేషన్ వర్తించదా?**

ఈ వ్యవహారంలో ప్రధానంగా తెలంగాణ ఎస్టీ రిజర్వేషన్ ప్రయోజనాలకు ఎవరు అర్హులనే అంశం చర్చకు వచ్చింది. సంబంధిత అభ్యర్థుల వద్ద తెలంగాణలో జారీ చేసిన ఎస్టీ ధ్రువపత్రాలు ఉన్నప్పటికీ, గిరిజన సంక్షేమ శాఖ తదుపరి స్థాయి పరిశీలనలో వారి కుటుంబాల మూలాలు, పూర్వ నివాసం, వలస నేపథ్యం వంటి అంశాలను పరిశీలించినట్లు నివేదికలో పేర్కొంది.కర్ణాటక, మహారాష్ట్రతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాల నుంచి తెలంగాణకు వలస వచ్చిన కుటుంబాల వివరాలను కూడా పరిశీలించినట్లు సమాచారం. ఈ పరిశీలన అనంతరం సంబంధిత అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర ఎస్టీ రిజర్వేషన్ ప్రయోజనం వర్తించదని శాఖ తేల్చింది.

**సుప్రీంకోర్టు..**
**హైకోర్టు తీర్పుల ప్రస్తావన**

రిజర్వేషన్ అర్హతను పరిశీలించే క్రమంలో గిరిజన సంక్షేమ శాఖ సుప్రీంకోర్టు, తెలంగాణ హైకోర్టు తీర్పులను కూడా ప్రస్తావించినట్లు నివేదికలో ఉంది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ అనంతరం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వచ్చిన వారికి రిజర్వేషన్ ప్రయోజనాలు వర్తించే అంశాన్ని న్యాయపరమైన నిర్ణయాల నేపథ్యంలో పరిశీలించినట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95ను కూడా ప్రస్తావించినట్లు సమాచారం.

**9 మందికి సీట్లు రద్దు**

37 మందిలో 9 మందికి ఇప్పటికే తొలి, రెండో దశ కౌన్సెలింగ్‌లో ఎస్టీ కోటా కింద ఎంబీబీఎస్ సీట్లు కేటాయించారు. తాజా నివేదిక నేపథ్యంలో ఆ 9 మంది ఎస్టీ కోటాలో ప్రవేశానికి అర్హులు కారని వర్సిటీ నిర్ణయించింది. దీంతో వారికి కేటాయించిన సీట్లను రద్దు చేసింది.రద్దయిన సీట్లలో ప్రభుత్వ వైద్య కళాశాల, వికారాబాద్, ఆర్‌వీఎం వైద్య విజ్ఞాన సంస్థ, సిద్దిపేట, ఈఎస్ఐసీ వైద్య కళాశాల, హైదరాబాద్, ఉస్మానియా వైద్య కళాశాల, హైదరాబాద్, రాజా రాజేశ్వరి వైద్య కళాశాల, పటాన్‌చెరు, నోవా వైద్య విజ్ఞాన సంస్థ, హైదరాబాద్, ప్రభుత్వ వైద్య కళాశాల, కరీంనగర్, టీఆర్ఆర్ వైద్య విజ్ఞాన సంస్థ, పటాన్‌చెరు తదితర కళాశాలలు ఉన్నాయి.

**మూడో దశ కౌన్సెలింగ్‌లో 9 సీట్లు**

రద్దయిన 9 ఎంబీబీఎస్ సీట్లను ఖాళీ సీట్లుగా పరిగణించి మూడో దశ లేదా మాప్‌అప్ కౌన్సెలింగ్‌లో అర్హులైన అభ్యర్థులకు కేటాయించనున్నారు.సంబంధిత నిబంధనలు, మెరిట్ ఆధారంగా ఈ సీట్ల భర్తీ జరగనుంది.

**37 మందికి పూర్తిగా వైద్య ప్రవేశం రద్దు కాదు**

కీలకంగా, 37 మంది అభ్యర్థులను పూర్తిగా వైద్య ప్రవేశాల నుంచి తొలగించినట్లు వర్సిటీ ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. ఎస్టీ రిజర్వేషన్ ప్రయోజనం మాత్రమే తొలగించి, వారి అర్హత, మెరిట్ ఆధారంగా ఓపెన్ కేటగిరీలో పరిగణించనున్నట్లు స్పష్టం చేసింది.

**సర్టిఫికెట్ల పరిశీలనపై ప్రశ్నలు**

అభ్యర్థులకు తెలంగాణలో ఎస్టీ ధ్రువపత్రాలు జారీ అయిన తర్వాత వైద్య ప్రవేశాల సమయంలో జరిగిన తదుపరి పరిశీలనలో వారి కుటుంబాల వలస నేపథ్యం వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది. ధ్రువపత్రాలు జారీ చేసే సమయంలోనే ఈ అంశాలను పరిశీలించారా? లేక వైద్య ప్రవేశాల సమయంలోనే గుర్తించారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే అందుబాటులో ఉన్న ఉత్తర్వుల్లో ధ్రువపత్రాలు జారీ చేసిన నిర్దిష్ట అధికారులను బాధ్యులుగా పేర్కొనలేదు. వారు ఏ రికార్డులను పరిశీలించారు, ఎక్కడ లోపం జరిగింది అనే పూర్తి వివరాలు కూడా వెల్లడించలేదు. కాబట్టి ఈ దశలో అధికారుల తప్పిదాన్ని అధికారికంగా నిర్ధారించిందని చెప్పడానికి ఆధారం లేదు.మొత్తంగా 37 మంది ఎస్టీ కేటగిరీ నుంచి ఓపెన్ కేటగిరీలోకి మారగా, ఇప్పటికే ఎస్టీ కోటాలో సీట్లు పొందిన 9 మంది అలాట్‌మెంట్లు రద్దయ్యాయి. ఈ సీట్లు మూడో దశ కౌన్సెలింగ్‌లోకి వెళ్లనున్నాయి. వైద్య ప్రవేశాల ప్రక్రియలో చోటుచేసుకున్న ఈ పరిణామం ఎస్టీ ధ్రువపత్రాల జారీ, అర్హత పరిశీలన విధానంపై మరోసారి దృష్టి సారించేలా చేసింది.

# మేడారం మినీ జాతర తేదీలు ఖరారు!

(మొదటి పేజీ తరువాయి)

భక్తులు వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు.

**భక్తుల కోసం భారీ ఏర్పాట్లు**

మినీ జాతరకు భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, విద్యుత్, రవాణా, వాహనాల పార్కింగ్, భద్రత తదితర సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాఖల వారీగా ప్రణాళిక రూపొందించి ఏర్పాట్లు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**సంప్రదాయ పద్ధతుల్లో జాతర**

సమ్మక్క-సారలమ్మ వనదేవతల ఆరాధనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. మినీ జాతరను కూడా సంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించేందుకు పూజారులు, అధికారులు, స్థానిక ప్రజలు సమన్వయంతో ఏర్పాట్లు చేయనున్నారు. జాతర సమీపిస్తున్న నేపథ్యంలో మేడారం పరిసర ప్రాంతాల్లో భక్తుల రాకపోకలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది.

## కాంగ్రెస్ బీఎల్ఏలే పార్టీకి మూలస్తంభాలు



**ఖమ్మం, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బూత్ లెవెల్ ఏజెంట్లే పార్టీకి నిజమైన మూలస్తంభాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ బీఎల్ఏల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయిలో కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. చింతకాని మండలంలోని బీఎల్ఏల పనితీరు ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తోందని భట్టి ప్రశంసించారు. కాంగ్రెస్ పార్టీని కన్నతల్లిలా భావించి పనిచేస్తున్న కార్యకర్తల సేవలు అమూల్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేర్చి ప్రజా పాలనకు మంచి పేరు తీసుకురావాల్సిన బాధ్యత బీఎల్ఏలపై ఉందన్నారు.

మధిర నియోజకవర్గం గత పదేళ్లలో అభివృద్ధి పరంగా వెనుకబడిందని, ఇప్పుడు ఆ లోటును భర్తీ చేసేందుకు వేగంగా పనులు చేపడుతున్నామని భట్టి తెలిపారు. రాబోయే రెండేళ్లలో పాఠశాలలు, రహదారులు, ఆసుపత్రులు సహా పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ప్రజలు గర్వపడే విధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని భట్టి పేర్కొన్నారు. రాష్ట్రంలోని సుమారు 1.06 కోట్ల కుటుంబాలకు నెలకు ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, స్వయం సహాయక సంఘాల రుణాల పునరుద్ధరణ, గృహ జ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయని వివరించారు.

పేదల వైద్య భద్రత కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించే 'ఇందిరమ్మ ధీమా' పథకాన్ని నవంబర్ 19న ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ పథకం ద్వారా లక్షలాది కుటుంబాలకు భరోసా కలుగుతుందని అన్నారు. విద్యారంగంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించి నేరుగా విద్యార్థుల ఖాతాల్లోనే నిధులు జమ చేస్తున్నామని భట్టి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 27 లక్షల మంది విద్యార్థులకు ఉచిత అల్పాహారం, పాలు, రాగిజావ అందిస్తున్నామని చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఆధునిక వసతులతో విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ పరిశీలకుడు దుద్దిళ్ల శ్రీను బాబు, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 8 వేల ఎకరాల భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**సిరిసిల్ల, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పలు అంశాలపై స్పందించారు. ముఖ్యమంత్రి హోదాలో జిల్లాకు వస్తున్న సందర్భంగా రాజకీయ విమర్శలకు బదులుగా ప్రజల సమస్యలపై సమాధానాలు చెప్పాలని కోరారు. సిరిసిల్ల అభివృద్ధి, భూముల వివాదాలు, నేత కార్మికుల సమస్యలు, ఎన్నికల హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ నాయకులు 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని, అందులో 2,400 ఎకరాలు తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని కేటీఆర్ కోరారు. ఏ మండలం, ఏ గ్రామం, ఏ సర్వే నంబరు, ఎవరి పేరుపై ఎంత భూమి ఉందో ప్రజలకు తెలియజేస్తూ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆరోపణల్లో నిజం ఉంటే ఆధారాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని, లేకపోతే సిరిసిల్ల ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ అన్నారు. భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో రైతుల అభ్యర్థనల మేరకు మాత్రమే రికార్డులు సవరించామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో జిల్లాలో జరిగిన భూ పంపిణీ వివరాలను కూడా వెల్లడించారు. సిరిసిల్ల నేత కార్మికుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పథకం, పాఠశాల దుస్తులు, కేసీఆర్ కిట్, పండుగ కానుకలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్ల ద్వారా ఉపాధి కల్పించిందని కేటీఆర్ తెలిపారు. దీంతో మరమగ్గాల పరిశ్రమ బలోపేతమై వేలాది కుటుంబాలకు ఉపాధి లభించిందని పేర్కొన్నారు. వస్త్రోత్పత్తి రంగంలో సిరిసిల్ల ప్రత్యేక గుర్తింపు సాధించిందని అన్నారు.

ప్రస్తుత ప్రభుత్వం బతుకమ్మ చీరల పథకాన్ని నిలిపివేసి నేత కార్మికుల ఉపాధిపై ప్రభావం చూపిందని కేటీఆర్ ఆరోపించారు. పెండింగ్ బకాయిల చెల్లింపులు, నూలు రాయితీ, వస్త్ర పరిశ్రమకు అవసరమైన ముడిసరుకు సరఫరాపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. నేత కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నేతన్నలు, రైతులు, విద్యార్థులు సహా అన్ని వర్గాలకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని కేటీఆర్ కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కాలపట్టిక ప్రకటించాలని, సిరిసిల్ల అభివృద్ధిపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ముందుంచిన వాగ్దానాల అమలుపై ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు.

# వాసవి క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం: హరీశ్ రావు

- **ప్రాంతీయ సదస్సు అవార్డుల ప్రధానోత్సవంలో పాల్గొన్న హరీశ్ రావు**
- **సేవ చేసిన వారిని గుర్తించడం కూడా గొప్ప సేవేనని వ్యాఖ్య**
- **సమాజానికి తిరిగి ఇవ్వాలనే ఆలోచన మరింత గొప్పదని అభిప్రాయం**
- **యువతలో సేవా భావం పెంపొందించాలని పిలుపు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంతీయ సదస్సు అవార్డుల ప్రధానోత్సవంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పాల్గొన్నారు. సమాజంలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను అవార్డులతో సత్కరించడం అభినందనీయమని ఆయన అన్నారు. సేవ చేసిన వారిని గుర్తించడం కూడా ఒక గొప్ప సేవేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ మంచి పనులు చేసిన వారిని ప్రోత్సహిస్తే మరింత మంది సేవా కార్యక్రమాల వైపు ఆకర్షితులవుతారని అన్నారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో ఇలాంటి గుర్తింపులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్న వాసవి క్లబ్‌ను అభినందించారు.

వాసవి క్లబ్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, సేవ, సంస్కారం, సామాజిక బాధ్యతల సమ్మేళనంగా నిలిచిన సేవా కుటుంబమని హరీశ్ రావు కొనియాడారు. విద్య, వైద్యం, రక్తదానం, అన్నదానం, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత వంటి అనేక రంగాల్లో క్లబ్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయితో పాటు అంతర్జాతీయ స్థాయిలో కూడా సేవలు అందిస్తున్నారని అన్నారు. సంపాదించడం గొప్ప విషయమే అయినప్పటికీ, సంపాదించిన దాంట్లో కొంత సమాజానికి తిరిగి ఇవ్వాలనే ఆలోచన మరింత గొప్పదని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి దగ్గర ఎంత సంపద ఉందన్నది కాదు, తన వల్ల ఎంతమంది జీవితాల్లో వెలుగు నిండిందన్నదే అసలు విలువ అని చెప్పారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలే నిజమైన సేవకు నిదర్శనమని పేర్కొన్నారు.

అవార్డులు అందుకుంటున్న వారందరికీ అభినందనలు తెలియజేసిన హరీశ్ రావు, ఈ గుర్తింపు వారి సేవలకు ముగింపు కాదని, మరింత గొప్ప సేవలకు ఇది ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. వారి సేవలు మరికొందరికి స్ఫూర్తిగా నిలిచి సమాజంలో సేవా భావాన్ని విస్తరించాలని అన్నారు. మంచి పనులు గొలుసుకట్టుగా విస్తరించి మరింత మందికి ఉపయోగపడాలని కోరారు.



యువత సమాజ సేవలో భాగస్వాములు కావాలని హరీశ్ రావు పిలుపునిచ్చారు. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడంతో పాటు సమాజ బాధ్యతను కూడా గుర్తుంచుకోవాలని సూచించారు. విద్య, వైద్యం, మహిళా సాధికారత, యువత ఉపాధి, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో వాసవి క్లబ్ మరిన్ని కార్యక్రమాలు చేపట్టి వేలాది కుటుంబాలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వాసవి క్లబ్ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు.

# క్రమశిక్షణ, నిబద్ధతతో లక్ష్య సాధనకు కృషి చేయాలి



- **ఉద్యాన కళాశాల సహ సంచాలకురాలు డా. వీణా జోషి**

**పెద్దమందడి,సెప్టెంబర్27(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల ఉద్యాన కళాశాలలో శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సహ సంచాలకురాలు డా. వీణా జోషి బాపూజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితంలోని క్రమశిక్షణ, నిబద్ధత, పట్టుదల, నిరంతర కృషి, సమాజ సేవా భావం నేటి యువతకు ఆదర్శప్రాయమన్నారు. ప్రజా సంక్షేమం, సమాజ అభివృద్ధి కోసం ఆయన చూపిన అంకితభావాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరవుతూ తరగతులు, ప్రయోగాత్మక బోధన, ఇతర విద్యా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని తెలిపారు. సమయపాలన, బాధ్యతాయుత ప్రవర్తన, నిరంతర కృషి భవిష్యత్తుకు బలమైన పునాదులుగా నిలుస్తాయని పేర్కొన్నారు.విద్యార్థులు తమ విద్య, నైపుణ్యాలను వ్యక్తిగత అభివృద్ధితో పాటు రైతులు, సమాజం, తెలంగాణ అభివృద్ధికి ఉపయోగపడేలా తీర్చిదిద్దుకోవాలని ఆమె సూచించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, నిబద్ధత, పట్టుదల, సేవా భావాన్ని అలవర్చుకోవాలని ఆకాంక్షించారు .ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బందితో పాటు ఒప్పంద సిబ్బంది, పట్టభద్ర విద్యార్థులు, డిప్లొమా విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనపురం ఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

- **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**ఖిల్లా ఘణపురం,సెప్టెంబర్27(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లాలోని ఘనపురం ఖిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనపురం ఖిల్లా వద్ద నిర్వహించిన ట్రెక్కింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఘనపురం ఖిల్లాకు ఘనమైన చారిత్రక నేపథ్యం ఉందని, ఇక్కడి కట్టడాలు పూర్వీకుల నిర్మాణ నైపుణ్యానికి నిదర్శనమన్నారు. ఖిల్లా అభివృద్ధికి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో చర్చించి రూ.2 కోట్ల నిధులతో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు, అవసరమైన అనుమతులు వచ్చిన వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని చెప్పారు.వనపర్తి జిల్లాలోని చారిత్రక, పర్యాటక ప్రాంతాలకు మరింత ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధితో స్థానిక ప్రాంతాలకు గుర్తింపు రావడంతో పాటు యువతకు చరిత్రపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు.విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. జిల్లాలోని చారిత్రక, ప్రకృతి పర్యాటక ప్రాంతాల విశిష్టతను ప్రజలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ట్రెక్కింగ్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులు, యువతలో చరిత్ర, వారసత్వ సంపదపై ఆసక్తి పెరుగుతుందని అన్నారు.అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే, కలెక్టర్ బహుమతులు అందజేసి అభినందించారు .కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వినోద్ కుమార్, డీవైఎస్ఓ సుధీర్ రెడ్డి, సీపీఓ హరికృష్ణ, నాయకులు సాయి చరణ్ రెడ్డి, ఆగారం ప్రకాష్, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాదేవి ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

- **వివేకానంద యూత్ అధ్యక్షుడిగా గణబోయిన విజయ్**

**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** ముల్కనూర్ గ్రామంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల కోసం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గణబోయిన విజయ్, ప్రధాన కార్యదర్శిగా సకినాల రమేశ్, ఉపాధ్యక్షుడిగా పిల్లల శ్రీధర్, కోశాధికారిగా వుడుత శ్రీనాథ్ ఎన్నికయ్యారు.
గౌరవ అధ్యక్షులుగా గుడికందుల కిషోర్, సుద్దాల రఘు బాధ్యతలు చేపట్టగా, కార్యవర్గ సభ్యులుగా దూలం జగన్, గుడికందుల శ్రీకాంత్, గుడికందుల అఖిల్, కీర్తి లవన్, బైరి రాంబాబు, గుడికందుల శ్రీనివాస్, పోతుగంటి రాకేష్ ఎన్నికయ్యారు.

30 ఏళ్లుగా వినాయక ఉత్సవాలు.. 15 ఏళ్లుగా దుర్గాదేవి నవరాత్రులు

ముల్కనూర్‌లో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో గత 30 ఏళ్లుగా వినాయక నవరాత్రి ఉత్సవాలు, 15 ఏళ్లుగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కులమతాలకు అతీతంగా గ్రామ ప్రజలు ఐకమత్యంతో ఉత్సవాల్లో పాల్గొంటూ భక్తి, సోదరభావాన్ని చాటుతున్నారు.
నూతన కమిటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది కూడా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



అధ్యక్షులు గనబోయిన విజయ్



సకినాల రమేష్ ప్రధాన కార్యదర్శి



కోశాధికారి వుడుత శ్రీనాథ్

# అక్షరాస్యతతో మహిళ సాధికారిత సాధ్యం

- **కొమ్ము రాధమ్మ, గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు**



**పెద్దమందడి,సెప్టెంబర్27(తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న ఉల్లాస్ – నవ భారత్ సాక్షరతా కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వయోజన మహిళలకు అక్షరాస్యత పరీక్షలు నిర్వహించారు. గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు కొమ్ము రాధమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కొమ్ము పెంటయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కొమ్ము రాధమ్మ మాట్లాడుతూ.. 15 సంవత్సరాలు దాటిన నిరక్షరాస్య మహిళలకు చదవడం, రాయడం, ప్రాథమిక గణితం వంటి అంశాలతో పాటు బ్యాంకింగ్ సేవల వినియోగం, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన, ఓటరు చైతన్యం తదితర జీవన నైపుణ్యాలను అందించడమే ఉల్లాస్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మహిళలు అక్షరాస్యులుగా మారడం ద్వారా తమ కుటుంబాల అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషించగలరని అన్నారు. గ్రామంలోని వయోజన మహిళలందరూ ప్రభుత్వం అందిస్తున్న అక్షరాస్యత కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ముఖ్య అతిథి సర్పంచ్ కొమ్ము పెంటయ్య మాట్లాడుతూ.. మహిళల అభివృద్ధికి విద్య ఎంతో అవసరమని, ప్రతి మహిళ అక్షరాస్యత సాధించడం ద్వారా కుటుంబంలో పిల్లల చదువుపై కూడా మంచి ప్రభావం ఉంటుందని అన్నారు. గ్రామంలోని మహిళలు ఉత్సాహంగా అక్షరాస్యత పరీక్షలకు హాజరై పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా సంఘం కోశాధికారి శారద, కార్యదర్శి తిరుపతమ్మ, పారిజాతమ్మ, బుసాని లలితమ్మ, కొమ్ము శారద, నార్వ వెంకటమ్మ, బండాలమ్మ, పద్మ, జంగం పద్మ, స్వాతి, ఊశనమ్మతో పాటు పలువురు మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాపూజీ

- **స్వాతంత్ర్య, తెలంగాణ ఉద్యమాల్లో బాపూజీ సేవలు చిరస్మరణీయం: మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్, సెప్టెంబర్ 27(తెలంగాణ ముచ్చట్లు ):** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ అని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్‌లో తెలంగాణ తొలితరం ఉద్యమ నేత ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.
ఎన్టీఆర్ చౌరస్తాలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దేశం, తెలంగాణ రాష్ట్రం కోసం బాపూజీ చేసిన సేవలను స్మరించుకున్నారు.
ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కొండ లక్ష్మణ్ బాపూజీ చూపిన ఆశయాలు, త్యాగనిరతి నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరాటాల్లో బాపూజీ పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969 ఉద్యమంలో తన మంత్రి పదవిని తృణప్రాయంగా త్యజించిన నిబద్ధత కలిగిన గొప్ప నాయకుడని అన్నారు.
కార్యక్రమంలో కార్పొరేటర్లు వాసాల రమేష్, మాసం గణేష్, చొప్పరి జయశ్రీ-వేణు, వేముల కవిత-చంద్రశేఖర్, పద్మశాలి సంఘం నాయకులు మెతుకు సత్యం తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల్లో.. ప్రజల్లో జోష్ నింపనున్న సీఎం పర్యటన

- **రూ.60 కోట్లతో నిర్మించిన నూతన కలెక్టరేట్ ప్రారంభం**
- **రూ.3 కోట్ల సుడా నిధులతో అభివృద్ధి పనులు**



**కరీంనగర్, సెప్టెంబర్ 27(తెలంగాణ ముచ్చట్లు ):** ముఖ్యమంత్రి పర్యటన కార్యకర్తల్లో, ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని నింపనుందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. రూ.60 కోట్లతో నిర్మించిన నూతన కలెక్టరేట్ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని తెలిపారు. అలాగే రూ.3 కోట్ల సుడా నిధులతో హెలిప్యాడ్, సింథటిక్ వాకింగ్ ట్రాక్, మెయిన్ రోడ్డు, గార్డెన్స్ తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.
బీజేపీ ఇటీవల నీటి విడుదల అంశంపై డ్రామా చేసిందని, నిన్న నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో దాడికి పాల్పడిందని నరేందర్ రెడ్డి ఆరోపించారు. దాడుల సంస్కృతిని ఎవరు ప్రోత్సహిస్తున్నారో ప్రజలకు తెలుసన్నారు. తమ ఓపికను పరీక్షించవద్దని హెచ్చరించారు.
కేబుల్ బ్రిడ్జి లైటింగ్ టెండర్ లోపభూయిష్టంగా ఉండటం వల్లే లైట్లు వెలగడం లేదని ఆరోపించారు. మెయిన్ పియర్స్ డిజైన్‌కు మూడు సంవత్సరాలు పట్టిందని, అందుకే ఆర్వోబీ నిర్మాణం ఆలస్యమవుతోందన్నారు.
బీఆర్ఎస్, బీజేపీల మధ్య చీకటి ఒప్పందం ఉందని, అందులో భాగంగానే ఇరు పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం లేదని నరేందర్ రెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతల భూదాహాన్ని బయటపెట్టారని, సిరిసిల్లలో బహిరంగ సభ అనగానే బీఆర్ఎస్ నేతలు ఉలిక్కిపడుతున్నారని వ్యాఖ్యానించారు.
"ఇన్నిరోజులు ఒక లెక్క.. ఇప్పటినుంచి ఒక లెక్క. ఇక కాస్కో కేటీఆర్" అని నరేందర్ రెడ్డి అన్నారు.

# సేవా సంకల్ప్ అభియాన్‌లో భారీ రక్తదాన శిబిరం

- **మహిళలు ఆత్మవిశ్వాసం, స్వయంకృషితో ఆర్థిక స్వావలంబన సాధించాలి: యాదగిరి సునీల్ రావు**





**కరీంనగర్, సెప్టెంబర్ 27(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాజీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా బీజేవైఎం కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో యువత, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా 25 ఏళ్లుగా ప్రజాసేవలో కొనసాగుతున్న ప్రధాని మోదీ మార్గదర్శనంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని అన్నారు. యువత సామాజిక సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే రక్తదానం అత్యంత పవిత్రమైన సేవ అని పేర్కొంటూ బీజేవైఎం నాయకులు, కార్యకర్తలను అభినందించారు.అదే సందర్భంగా సక్సెస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ బ్యూటీ సొల్యూషన్స్ (సిబ్స్) బ్యూటీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమంలోనూ సునీల్ రావు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.మహిళలు ఆత్మవిశ్వాసం, స్వయంకృషితో ముందుకు సాగుతూ ఆర్థిక స్వావలంబన సాధించాలని సునీల్ రావు సూచించారు. గత పదేళ్లుగా స్వప్న ఆధ్వర్యంలోని సిబ్స్ సంస్థ ద్వారా 2,500 మందికి పైగా మహిళలకు బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ అందించి, స్వయం ఉపాధి వైపు నడిపించడం అభినందనీయమన్నారు. ఏ రంగంలోనైనా రాత్రికి రాత్రే విజయం సాధ్యం కాదని, నిరంతర శ్రమ, ఓర్పు, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకునే తత్వం అవసరమని అన్నారు. శిక్షణను పట్టణాలకే పరిమితం చేయకుండా గ్రామీణ ప్రాంతాల మహిళలకు సైతం విస్తరించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్వప్న చేస్తున్న కృషిని అభినందించారు.మహిళా సాధికారత కుటుంబ, సమాజ అభివృద్ధికి కీలకమని పేర్కొన్న ఆయన.. శిక్షణ పొందిన మహిళలు తమ నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుని సొంతంగా బ్యూటీ పార్లర్లు, సంస్థలు ఏర్పాటు చేసి మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమం అనంతరం హాజరైన వారంతా కలిసి ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షించారు.
ఈ కార్యక్రమాల్లో బీజేపీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు గుజ్జ శ్రీనివాస్, చొప్పరి జయశ్రీ, పొన్నం మొండయ్య, మాసం గణేష్, గాజె శివరాం, ఎన్నం ప్రకాష్, బీజేపీ జోన్ అధ్యక్షులు అవదుర్తి శ్రీనివాస్, తణుకు సాయికృష్ణ, పాదం శివరాజ్, బండారి గాయత్రి, బీజేపీ నాయకులు చంద్రమౌళి, చాడ ఆనంద్, గర్థస్ సతీష్, అడిచెర్ల రాజు, గుంజెటి శివకుమార్, పండుగ నాగరాజు, నక్క ప్రమోద్, కదర్ల విమల్ కుమార్, వెంకటేష్ అన్నాజీ, వినీత్ గున్నాల తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మహిళలు ఆత్మవిశ్వాసంతో ఆర్థిక స్వావలంబన సాధించాలి



- స్వయంకృషి, నైపుణ్యంతో విజయాలు సాధించాలి: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాదగిరి సునీల్ రావు

**కరీంనగర్, సెప్టెంబర్ 27(తెలంగాణ ముచ్చట్లు ):** మహిళలు ఆత్మవిశ్వాసం, స్వయంకృషితో ముందుకు సాగుతూ ఆర్థిక స్వావలంబన సాధించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. కరీంనగర్ నగరంలో సక్సెస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యూటీ సొల్యూషన్స్ (సిబ్స్) బ్యూటీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్టిఫికేషన్ ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ.. గత పదేళ్లుగా సిబ్స్ ఇనిస్టిట్యూట్ ద్వారా స్వప్న రావు 2,500 మందికి పైగా మహిళలకు బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ అందించి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి స్వయం ఉపాధి వైపు నడిపించడం అభినందనీయమన్నారు. తాము ఎంచుకున్న వృత్తిపై నమ్మకంతో, ధైర్యంతో ముందుకు సాగినప్పుడే ఆశించిన విజయాన్ని సాధించగలరని సూచించారు.

ఏ రంగంలోనైనా రాత్రికి రాత్రే విజయం సాధ్యం కాదని, నిరంతర శ్రమ, ఓర్పు, పట్టుదలతో పాటు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, నూతన పోకడలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల మహిళలకు కూడా శిక్షణ అందిస్తూ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సిబ్స్ చేస్తున్న కృషిని అభినందించారు.కుటుంబం, సమాజ అభివృద్ధిలో మహిళా సాధికారత కీలకమని పేర్కొన్న సునీల్ రావు.. శిక్షణ పొందిన మహిళలు తమ నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుని సొంతంగా బ్యూటీ పార్లర్లు, సంస్థలు ఏర్పాటు చేసి మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో సిబ్స్ నిర్వాహకురాలు స్వప్న రావు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, డాక్టర్ పద్మజ, సిబ్స్ ప్రతినిధులు, సభ్యులు, పెద్ద సంఖ్యలో శిక్షణ పొందిన మహిళా అభ్యర్థులు పాల్గొన్నారు.

# వైద్య విద్యలో సీటు సాధించిన నక్షత్రకు ఘన సన్మానం



- అభినందించిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి దంపతులు

**అడ్డాకల్,సెప్టెంబర్27(తెలంగాణ ముచ్చట్లు):**వైద్య విద్యలో ప్రతిభ కనబరిచి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వైద్య విద్య సీటు సాధించిన నక్షత్రను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఆయన సతీమణి వాసంతి ఘనంగా సన్మానించి అభినందించారు.అడ్డాకల్ మండలం కన్మానూర్ మాజీ సర్పంచ్ సుమతమ్మ, భీమిరెడ్డి దంపతుల మనుమరాలు, ఝాన్సీ కుమార్తె అయిన నక్షత్ర వైద్య విద్యలో సీటు సాధించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నక్షత్ర తన ప్రతిభతో నియోజకవర్గానికి పేరు తీసుకువచ్చిందని నిరంజన్‌రెడ్డి అన్నారు. విద్యకు సంబంధించిన అవసరాల్లో తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, పలుస రమేష్‌గౌడ్, నందిమల్ల అశోక్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, జాత్రు నాయక్, శంకర్‌గౌడ్, గౌడ్ నాయక్, బాబు నాయక్, అలీం తదితరులు పాల్గొన్నారు.

# జాషువా 131వ జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రిక విడుదల



**వనపర్తి,సెప్టెంబర్27(తెలంగాణ ముచ్చట్లు):** నవయుగ కవి చక్రవర్తి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత గుర్రం జాషువా 131వ జయంతి ఉత్సవాలను ఈ నెల 29న ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఏం.ఎన్. ఆర్ బ్యాంక్వెట్ హాల్‌లో ఈ వేడుకలు జరగనున్నాయి. జయంతి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరుకానుండగా, సభాధ్యక్షతను పలుస శంకర్ గౌడ్ వహించనున్నారు.ఆత్మీయ అతిథులుగా రావుల చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ పాల్గొననున్నారు. ప్రధాన వక్తలుగా ఆచార్య కోయి కోటేశ్వరరావు, డాక్టర్ జిలుకర శ్రీనివాస్ హాజరుకానున్నారు.జాషువా సాహిత్యాన్ని, ఆయన సామాజిక చైతన్యాన్ని స్మరించుకునే ఈ కార్యక్రమంలో కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, సాహితీ ప్రియులు, దళిత బహుజన నాయకులు, జాషువా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# పామిరెడ్డిపల్లి వైరాగ్యగిరికి మహర్దశ

- ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా సహకారం
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**పెద్దమందడి,సెప్టెంబర్27(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ వైరాగ్యగిరిశ్వర స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తుల ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా సహకరిస్తామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు.ఆదివారం పామిరెడ్డిపల్లి గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే వైరాగ్యగిరి చుట్టూ అభివృద్ధి చేసిన గిరిప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్‌తో కలిసి భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, గిరిప్రదక్షిణ మార్గం అభివృద్ధిపై చర్చించారు.వైరాగ్యగిరి ఆలయానికి ఉన్న ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాశస్త్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే తెలిపారు. అక్టోబర్ 12న గిరిప్రదక్షిణ మార్గ సంప్రోక్షణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.గతంలో కెనాల్ పనులు పూర్తయిన సందర్భంగా వచ్చిన తొలి నీటితో పరమశివుడికి అభిషేకం చేసిన విషయాన్ని గుర్తుచేసుకున్న ఎమ్మెల్యే.. అప్పట్లో ఇచ్చిన మాట ప్రకారం వైరాగ్యగిరిశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అరుణాచలం తరహాలో పామిరెడ్డిపల్లి వైరాగ్యగిరి గిరిప్రదక్షిణకు భక్తుల ఆదరణ లభించేలా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లలో చెట్ల తొలగింపు

- మల్టీప్లెక్స్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ గేట్ వరకు భారీగా కొమ్మల తొలగింపు
- స్థానికులు, పర్యావరణ ప్రేమికుల విస్మయం
- అభివృద్ధి పనుల పేరుతో చెట్ల తొలగింపుపై ఆందోళన

**కరీంనగర్, సెప్టెంబర్ 27(తెలంగాణ ముచ్చట్లు ):** ఈనెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కరీంనగర్ నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. సీఎం పర్యటన నేపథ్యంలో రహదారుల అభివృద్ధి, పరిసరాల శుభ్రత తదితర పనులు కొనసాగుతున్నాయి.

అయితే మల్టీప్లెక్స్ చౌరస్తా నుంచి నూతన కలెక్టరేట్ గేట్ వరకు ఉన్న మార్గంలో పెద్ద ఎత్తున చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు, ఏపుగా పెరిగిన కొన్ని చెట్లను సైతం నరికివేయడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సీఎం పర్యటన ఏర్పాట్లలో భాగంగానే ఈ చర్యలు చేపట్టినట్లు స్థానికులు చెబుతున్నారు.

అభివృద్ధి పనుల పేరుతో చెట్లను తొలగించడంపై పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి అభివృద్ధి, భద్రతా ఏర్పాట్లకు అవసరమైన చర్యలు చేపట్టినప్పటికీ, సాధ్యమైనంత మేర చెట్లను సంరక్షిస్తూ పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

# త్యాగధనుడు కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



**జమ్మికుంట, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పదవులను సైతం త్యాగం చేసి, మలిదశ తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శిగా నిలిచిన బాపూజీ జయంతి సందర్భంగా ఆయన సేవలను, పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ ఘన నివాళులర్పించారు.

జమ్మికుంటలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, విగ్రహం ఏర్పాటు చేయనున్న ప్రదేశంలోనే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించాలని భావించినప్పటికీ పద్మశాలి కుల సంఘం అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో గాంధీ చౌరస్తాలో కార్యక్రమాన్ని నిర్వహించాల్సి వచ్చిందన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఆ ప్రాంతానికి కొండా లక్ష్మణ్ బాపూజీ మార్గ్‌గా పేరు పెట్టే కార్యక్రమాన్ని చేపట్టాలనే ఆలోచన ఉందన్నారు. వచ్చే జయంతి, వర్ధంతిలోపు విగ్రహాన్ని ఏర్పాటు చేసి, అక్కడే అధికారికంగా కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు పద్మశాలి కుటుంబ సభ్యులందరూ ఐక్యంగా కృషి చేయాలని, ప్రతి కార్యక్రమంలో భాగస్వాములై ఆయన ఆశయ సాధనకు ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చుంచు రమాదేవి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దిడ్డి రాము, మాజీ జెడ్పీటీసీ అరుకాల వీరేశలింగం, బొద్దుల రవీందర్, ఉడుత రమేష్‌తో పాటు పద్మశాలి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల త్యాగాలకు రాజకీయ గుర్తింపు ఇవ్వాలి



**జమ్మికుంట, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మలిదశ ఉద్యమంలో జీవితాలను పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారులకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎక్కటీ సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి అన్ని రాజకీయ పార్టీలు వారికి 20 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేలా ప్రత్యేక విధానాన్ని ప్రకటించాలని కోరారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం అనేక త్యాగాలు, పోరాటాలతో సాగిందని సంజీవరెడ్డి పేర్కొన్నారు. వేలాది మంది ఉద్యమకారులు నిరసనలు, ఆందోళనలు, ర్యాలీలు, ధర్నాల్లో పాల్గొని రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను ఉద్యమానికి అంకితం చేశారని తెలిపారు. ఉద్యమ సమయంలో అనేక మంది ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్రంగా గాయపడి అవయవాలు కోల్పోయారని, పలువురు కేసులు ఎదుర్కొని జైలు జీవితాన్ని అనుభవించారని గుర్తుచేశారు.

రాష్ట్ర సాధన అనంతరం కూడా ఉద్యమకారుల త్యాగాలను విస్మరించకుండా వారికి గౌరవం, గుర్తింపు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాణాలు కోల్పోయిన ఉద్యమకారుల కుటుంబాలతో పాటు అవయవాలు కోల్పోయిన వారు, కేసులు ఎదుర్కొన్న వారు, జైలు పాలైన ఉద్యమకారులను గుర్తించి వారి సేవలను అధికారికంగా నమోదు చేయాలని కోరారు.

ఉద్యమకారులకు గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు రాజకీయ అవకాశాలు కల్పించాలని ఆయన అన్నారు. సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసే అవకాశాలతో పాటు రాజకీయ పార్టీల సంస్థాగత నిర్మాణంలోనూ వారికి సముచిత స్థానం కల్పించాలని సూచించారు. పార్టీ పదవులు, కమిటీలు, స్థానిక సంస్థలు, శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో ఉద్యమకారుల పాత్రను గుర్తించాలని కోరారు.

ఉద్యమకారులను కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తు చేసుకోకుండా పార్టీ నిర్ణయ ప్రక్రియలోనూ వారికి ప్రాధాన్యం కల్పించాలని సంజీవరెడ్డి అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఉద్యమకారుల సమస్యలపై చర్చించి, వారికి 20 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే అంశంపై తమ విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులకు రాజకీయంగా అవకాశాలు కల్పించడం వారి త్యాగాలకు ఇచ్చే గౌరవంగా భావించాలని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించడంతో పాటు ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారిని గుర్తించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యతగా భావించాలని ఎక్కటీ సంజీవరెడ్డి కోరారు.

# అక్షరమే ఆయుధం.. నిరక్షరాస్యతపై సమరం



**జమ్మికుంట, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** నిరక్షరాస్యతను నిర్మూలించి ప్రతి ఒక్కరికీ అక్షరజ్ఞానం అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం నిరక్షరాస్యులకు పరీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం గొప్ప అవకాశమన్నారు. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 3,770 మంది నిరక్షరాస్యులను గుర్తించగా, ఆదివారం 2,842 మందికి పరీక్ష నిర్వహించడం శుభపరిణామమని పేర్కొన్నారు. విద్య నేర్చుకోవడానికి వయస్సు అడ్డంకి కాదని, ప్రతి ఒక్కరూ అక్షరజ్ఞానం పొందడం ద్వారా నిత్యజీవితంలో స్వతంత్రంగా వ్యవహరించడంతో పాటు ఆధునిక సమాజంలో ఆత్మవిశ్వాసంతో జీవించగలరని అన్నారు. అక్షరాస్యతతోనే వ్యక్తిగత, సామాజిక అభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు.

ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధికారులు, సిబ్బంది, ఆర్పీలు, ఇన్విజిలేటర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అక్షరాస్యత లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చైర్మన్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో దిడ్డి రాము, మెప్మా సిబ్బంది జ్యోతి, మంజుల, విజయ, దేవేంద్రతో పాటు పలువురు ఆర్పీలు, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# కాంగ్రెస్ నాయకులవి అసత్యపు ప్రకటనలు



- **బీజేపీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్**

**చిల్పూర్, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నారో నియోజకవర్గ ప్రజలకు స్పష్టం చేయాలని బీజేపీ చిల్పూర్ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ డిమాండ్ చేశారు.చిల్పూర్ మండలంలోని రాజవరంలో ఆదివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా, నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరినట్లు రాజకీయ పతనం భయంతో కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలు, ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ -బీజేపీ పొత్తులోనే కడియం శ్రీహరికి రాజకీయ అవకాశం లభించిందన్న విషయాన్ని మరిచిపోయారని అన్నారు. బీజేపీని లక్ష్యంగా చేసుకున్న కొద్దీ పార్టీ మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు.కడియం శ్రీహరిపై దాఖలైన అనర్హత పిటిషన్లను తెలంగాణ శాసనసభ స్పీకర్ 2026 మార్చి 11న కొట్టివేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కడియం శ్రీహరిపై అనర్హత వేటు పడుతుందంటూ ఉపేందర్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు ఆయన రాజకీయ అభిప్రాయంగా పేర్కొనాలి.కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు వెలిశాల శ్రీనివాస్, ముక్కెర శ్రావణ్ యాదవ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ కన్నబోయిన అశోక్ యాదవ్, నాయకులు కట్ల అనిల్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# బాపూజీ ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి




- **మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ**

**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను ఆదివారం స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా కమిషనర్ రాధాకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన కీలక పాత్రను, ప్రజాసేవకు ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు.
కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సత్యనారాయణ, సీనియర్ సహాయకులు లింగయ్య, సీనియర్ లెక్కల అధికారి నితిన్, జూనియర్ సహాయకులు సందీప్, శ్రీనివాస్, సుమలత, మంజుల, మధు, జూనియర్ లెక్కల అధికారి లత, పట్టణ ప్రణాళిక అధికారి సాయి, సహాయ ఇంజినీర్ అనిల్, వైస్ చైర్మన్ నీల రాజమ్మ గట్టయ్య, కౌన్సిలర్ తాటికొండ మధు తదితరులు పాల్గొన్నారు.

# వరదలో నీటమునిగిన మిర్చి పంట



- **అప్పులు చేసి సాగు చేసిన పంట కళ్ల ముందే నీటిపాలు**
- **నష్టంతో కన్నీరుమున్నీరవుతున్న రైతు కుటుంబం**

**వాజేడు, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** భారీ వర్షాలు, గోదావరి వరదలతో మిర్చి రైతు తీవ్రంగా నష్టపోయాడు. ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు గ్రామానికి చెందిన రైతు గొర్లపల్లి సుమన్ సాగు చేసిన మిర్చి పంట పూర్తిగా నీటమునిగింది. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు గోదావరి వరద నీరు పంట పొలాల్లోకి చేరడంతో మిర్చి మొక్కలు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి.అప్పులు చేసి ఎంతో కష్టపడి సాగు చేసిన పంట కళ్ల ముందే నీటిపాలు కావడంతో రైతు సుమన్ కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది. పంట పూర్తిగా దెబ్బతినడంతో భారీగా నష్టం వాటిల్లిందని రైతు కన్నీరుమున్నీరయ్యాడు. పంట సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక కుటుంబం ఆందోళన చెందుతోందని వాపోయాడు.
పరిహారం అందించాలని వేడుకోలు
నీటమునిగిన మిర్చి పంటను అధికారులు వెంటనే పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని రైతు కుటుంబం కోరుతోంది. పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి, ప్రభుత్వం తగిన పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేసింది. భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# స్టేషన్ ఘనపూర్‌లో మొబైల్ షాపులో చోరీ



**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** పట్టణంలోని శివాజీ సెంటర్ సమీపంలో ఉన్న అల్ఫా మొబైల్స్ దుకాణంలో చోరీ జరిగింది. దుకాణ యజమాని కుసుమ సాంబశివరావు శనివారం రాత్రి 9.30 గంటలకు దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం వచ్చి చూడగా దుకాణం వెనుక తలుపులు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు.
దుకాణంలో నుంచి ఒక ఐటెల్ మొబైల్, రెండు ప్రొజెక్టర్లు, ఒక డ్రోన్, 30 బ్లూటూత్ పరికరాలు, 60 స్పీకర్లు, కేబుల్స్, ఛార్జర్లు, మూడు సోలార్ లైట్లు, 30 ఇయర్ ఫోన్లు సహా సుమారు రూ.50 వేల విలువైన సామగ్రి చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజామున 5 గంటల మధ్య చోరీ జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు క్లూస్ బృందం, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. దుకాణం పరిసరాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# గోదావరి వరద ఉధృతి పెరుగుతోంది

- **ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి**
- **సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు**



**ఏటూరునాగారం, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** ములుగు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. దీంతో ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏటూరునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు సూచించారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఓడగూడం వద్ద గోదావరి వరద నీటి ప్రవాహాన్ని ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గోదావరి నీటిమట్టం 14.18 మీటర్లకు చేరుకుందని, త్వరలోనే మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 14.83 మీటర్లకు చేరుకునే అవకాశం ఉందన్నారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ, పోలీస్, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో అప్రమత్తంగా ఉండాలని కోరారు.
ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ముంపు ప్రాంతాల్లోని ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని శ్రీలత లక్ష్మణ్ బాబు సూచించారు. ప్రజలు అత్యవసర పరిస్థితులు తప్ప నది వైపు వెళ్లవద్దని, రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా పిల్లలు, పశువులను నది పరిసరాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సమాచారం అందించాలని అధికారులను కోరారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా ప్రజలు అధికారులకు సమాచారం అందించి సహకరించాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.
కార్యక్రమంలో తుమ్మ మల్లారెడ్డి, కూనూరు అశోక్ గౌడ్, తాడూరి రఘు, కర్ర రవీందర్, ఉపసర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, కొండాయి చిన్ని, కార్యదర్శి జనార్ధన్, ఖాతా యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# అక్టోబర్ 4న మాలల సభ

- **రోస్టర్ సవరణ కోసం ఐక్యంగా గళం విప్పాలి**



**హుజురాబాద్,సెప్టెంబర్ 27(తెలంగాణ ముచ్చట్లు ):** మాల సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ, రోస్టర్ సవరణ సాధన కోసం అక్టోబర్ 4న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న “మాల విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగస్థుల సభ”ను విజయవంతం చేయాలని మాల స్టూడెంట్స్ జేఏసీ చైర్మన్ మాదాసు రాహుల్ రావు పిలుపునిచ్చారు. శనివారం రాత్రి హుజురాబాద్‌కు చేరుకున్న మాల విద్యార్థుల జేఏసీ నాయకులకు హుజురాబాద్ మాల సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్టోబర్ 4న నిర్వహించనున్న మాలల సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాల సామాజిక వర్గానికి సంబంధించిన పలు సమస్యలపై చర్చించారు.
ఈ సందర్భంగా మాదాసు రాహుల్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మాల సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి మాల విద్యార్థుల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తున్నామని పేర్కొన్నారు. మాలలకు జరుగుతున్న అన్యాయాలపై ప్రతి ఒక్కరూ ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం మాల విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా రోస్టర్ సవరణ సాధనే లక్ష్యంగా అక్టోబర్ 4న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న మహాసభను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, మాల సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. మాల సామాజిక వర్గ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో తమ డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.హుజురాబాద్ మాల సంఘం నాయకులు మాట్లాడుతూ మాల విద్యార్థుల జేఏసీ చేపడుతున్న కార్యక్రమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. రోస్టర్ సవరణతో పాటు మాల విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. అక్టోబర్ 4న హైదరాబాద్‌లో జరిగే సభకు హుజురాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు పాక సతీష్, రాష్ట్ర కార్యదర్శి పసుల స్వామి, కౌన్సిలర్ సొల్లు సునీత, నాయకులు సొల్లు బాబు, సందమల్ల బాబు, యేముల పుష్పలత, పోతుల సంజీవ్, యాదగిరి, బెల్లి వెంకట స్వామి, పిట్ట శ్రీనివాస్, నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

# కరాటే పోటీల్లో హుజురాబాద్ విద్యార్థుల సత్తా

- **గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన చిన్నారులకు అభినందనలు**




**హుజురాబాద్,సెప్టెంబర్ 27(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్‌కు చెందిన విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి పలు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. వివిధ విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి హుజురాబాద్‌కు పేరు తీసుకువచ్చారు.
ఈ పోటీల్లో ఎస్కే. సదుల్లా బాబా స్పారింగ్‌లో గోల్డ్ మెడల్, భాను తేజ కటాస్‌లో గోల్డ్ మెడల్, సాయి చరణ్ స్పారింగ్‌లో గోల్డ్ మెడల్, కటాస్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. అలాగే హుమేరా తస్లీమ్, వినూత్న, సాక్షిత్, హేమ, సాయి, ఎస్. కె. గౌసియాలు కటాస్ విభాగంలో గోల్డ్ మెడల్స్ సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు.
విద్యార్థుల విజయంపై తెలంగాణ రిటైర్డ్ ఆల్ పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, రిటైర్డ్ పీడీ కొన్ని రాజిరెడ్డి, 17వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ ఖలీద్ హుస్సేన్, జ్యోతిరావు పూలే జయంతోత్సవ కమిటీ మాజీ చైర్మన్ ఉప్పు శ్రీనివాస్ పటేల్, న్యూ కాకతీయ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ బి. రాజ్ కుమార్, ప్రిన్సిపల్ వెంగళరావు, డైరెక్టర్ వి. గోపాల్, కరాటే మాస్టర్ తదితరులు విద్యార్థులను అభినందించారు.
విద్యార్థులు క్రమశిక్షణతో సాధన చేస్తూ కరాటేలో ప్రతిభను చాటుకోవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించి హుజురాబాద్‌కు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు

- **హుజురాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళులు**



**హుజురాబాద్,సెప్టెంబర్ 27(తెలంగాణ ముచ్చట్లు ):** స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక, తెలంగాణ ఉద్యమ పితామహుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను హుజురాబాద్ పద్మశాలి సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని హనుమకొండ రోడ్డులో గల కొండా లక్ష్మణ్ బాపూజీ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పద్మశాలి సంఘం నాయకులు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ పద్మశాలి ముద్దుబిడ్డగా జన్మించడం పద్మశాలి కుల బాంధవులందరికీ గర్వకారణమన్నారు. ప్రజలకు న్యాయం చేయాలనే ఆశయంతో న్యాయవాద వృత్తిని చేపట్టి, నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో పాల్గొన్న ఉద్యమకారులకు న్యాయపరంగా అండగా నిలిచారని కొనియాడారు. చేనేత, సహకార రంగాలకు న్యాయం జరిగేలా కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత సహకార ఉద్యమానికి అండగా నిలిచారని పేర్కొన్నారు. 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో వయోభారాన్ని సైతం లెక్కచేయకుండా తెలంగాణ సాధన కోసం దీక్షలు చేపట్టి ఉద్యమానికి తన మద్దతును ప్రకటించారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని పద్మశాలి యువత సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో వేముల యాదగిరి, విడప రాజు, మంద రమేష్, చిలుకమారి శ్రీనివాస్, సబ్బని రాజేందర్, కుడికాల భాస్కర్, సంగెం భాస్కర్, కొండా గణేష్, మండల యాదగిరి, కుడికాల సాయి, ఇప్పనపల్లి చంద్రశేఖర్, ఆడెపు సూర్యం, మంద బిక్షపతి, మండల సేకరయ్య, గంజి జయవర్ధన్, సంగం భాస్కర్, సంగం ఐలయ్య, సంగం శ్రీనివాస్, చిక్స్ సంఘం శ్రీనివాస్, మెడికల్ కడవెరుగు సత్యం, గాలి సమ్మయ్య తదితర పద్మశాలి సంఘం నాయకులు, కుల బాంధవులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# పర్యాటక వసతుల అభివృద్ధితో గ్రామీణ ప్రాంతాలకు కొత్త శోభ...

- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**
- **చింతకాని మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం**

**ఖమ్మం బ్యూరో , సెప్టెంబర్ -27(తెలంగాణ ముచ్చట్లు ):** పర్యాటక వసతుల అభివృద్ధితో గ్రామీణ ప్రాంతాలకు కొత్త శోభ తీసుకురావడంతో పాటు స్థానికంగా ఉపాధి, ఆర్థిక అవకాశాలు పెరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు.

ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌లతో కలిసి డిప్యూటీ సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

చింతకాని మండల కేంద్రంలోని చెరువు వద్ద రూ.7 కోట్ల 90 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పర్యాటక వసతుల కల్పన పనులకు, పందిళ్లపల్లి నుండి అనంతసాగర్ మీదుగా చింతకాని జడ్పీ రోడ్డు వరకు రూ. 4 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, జగన్నాథపురంలో ఖమ్మం-బోనకల్ ఆర్అండ్‌బీ రోడ్డు నుండి న్యూ మార్కెట్ మీదుగా మత్కేపల్లి-పందిళ్లపల్లి వరకు రూ. 4 కోట్ల 50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పంచాయతీరాజ్ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, చింతకాని పరిధిలోని నరసింహాపురం ఎస్సీ కాలనీలో రూ.18 లక్షలతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, నాగులవంచ గ్రామంలో నాగులవంచ నుండి రైల్వే కాలనీ ఆర్ అండ్ బీ రోడ్డు అండర్‌పాస్ వరకు రూ. 5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు డిప్యూటి సీఎం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో మౌళిక వసతులను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనలో భాగంగా గత 34 నెలలుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామనితెలిపారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తయ్యేలా ప్రజా ప్రతినిధులు పర్యవేక్షణ చేయాలని సూచించారు.

ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని, ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.60 పైగా విలువైన సన్న బియ్యాన్ని రాష్ట్రంలోని కోటి 6 లక్షల కుటుంబాలకు ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గతంలో ఇండ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని, ప్రస్తుతం ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తూ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ. 5 లక్షలు జమ చేస్తున్నామని తెలిపారు.

మొదటి విడతలోనే నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, రెండవ విడతలో మరో రెండున్నర లక్షల ఇండ్ల మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. నిరుపేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వడ్డీ లేని రుణాలను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు.

ప్రతి సంవత్సరం మహిళలకు రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి బస్సులు, సౌర విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, సిపిఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక లడ్డూకు భారీ ధర



- **శ్రీ ఏకదంతాయ యువజన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా లడ్డూ వేలం**

**తూర్పుతండా ఏనుగల్లు, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** శ్రీ ఏకదంతాయ యువజన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక లడ్డూ వేలం పాటలో భక్తుల ఉత్సాహం వెల్లువెత్తింది. వేలం పాటలో వినాయక లడ్డూకు భారీ ధర పలకడంతో కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు ఉత్సాహంగా వేలం పాటలో పాల్గొనగా, చివరకు మాజీ సర్పంచ్ బానోతు రవి లడ్డూను రూ.99 వేలకు దక్కించుకున్నారు. వినాయకుడిపై భక్తి, సంప్రదాయాల పట్ల నమ్మకంతో వేలంలో పాల్గొన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే భక్తి కార్యక్రమాలు, ఇతర సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులు, దాతలు, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

వినాయకుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బాదావత్ వినోద్ కుమార్, ఖజాంచి బానోతు సచిన్, కమిటీ సభ్యులు రమేష్, తరుణ్, వెంకటేష్, ప్రవీణ్, గుణశేఖర్, రాకేష్, గ్రామ సర్పంచ్ బానోతు దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు-కూలీ సంక్షేమమే సమాజ ప్రగతి

- **జాతీయ ఉపాధ్యక్షులు జె.వి చలపతిరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం గౌరవ అధ్యక్షులు వి. కోటేశ్వరరావు**
- **శ్రమకు తగ్గ గౌరవం ఇవ్వాలి**
- **ఖమ్మం వేదికగా ఏఐకెఎంఎస్ 4వ జాతీయ మహాసభలు**
- **28న భారీ ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ**




**ఖమ్మం బ్యూరో , సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు ):** నేలను నమ్ముకుని పంట పండించే రైతు చేతుల్లోనే దేశ ఆహార భద్రత ఉందని, చెమట చిందించి సమాజ నిర్మాణానికి బాటలు వేసే కూలీ శ్రమలోనే దేశ అభివృద్ధి దాగి ఉందని చాటిచెప్పేలా అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) 4వ అఖిల భారత మహాసభలకు ఖమ్మం నగరం వేదిక కానుందని జాతీయ ఉపాధ్యక్షులు జె.వి చలపతిరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం గౌరవ అధ్యక్షులు వి. కోటేశ్వరరావు లు అన్నారు.

ఖమ్మం నగరంలో టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) 4వ అఖిల భారత మహాసభలకు సర్వం సిద్ధమైన సందర్భంగా ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

ఈ నెల సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న ఈ మహాసభలకు సర్వం సిద్ధమైంది. 'వ్యవసాయాన్ని కాపాడండి - రైతాంగాన్ని రక్షించండి' అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ మహాసభలు రైతు, వ్యవసాయ కార్మికుడు, కూలీ ఎదుర్కొంటున్న సమస్యలపై సమాజంలో చైతన్యం తీసుకురావడంతో పాటు, శ్రమకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యతను నేటి తరానికి గుర్తుచేయనున్నాయి. ముఖ్యంగా యువత సమాజం పట్ల బాధ్యతతో ముందుకు సాగేందుకు ఈ మహాసభలు ఒక సందేశ వేదికగా నిలవనున్నాయి. 28న భారీ ప్రజా ప్రదర్శన మహాసభల్లో భాగంగా సెప్టెంబర్ 28న మధ్యాహ్నం 12 గంటలకు ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుంచి భారీ ప్రజా ప్రదర్శన ప్రారంభమై యస్ఆర్ అండ్ బిజియస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వరకు కొనసాగనుంది. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు కాలేజీ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ బహిరంగ సభకు ఏఐకెఎంఎస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య అధ్యక్షత వహించనున్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆశిష్ మిట్టల్, జాతీయ ఉపాధ్యక్షులు నిర్భయ్ సింగ్, జె.వి. చలపతిరావు, జాతీయ కార్యదర్శి బాలచందర్ షడంగీతో పాటు పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాలకు చెందిన నాయకులు ప్రసంగించనున్నారు.

వ్యవసాయం కేవలం ఒక వృత్తి కాదని, కోట్లాది ప్రజల జీవితాలకు అన్నం పెట్టే జీవనాధారమని మహాసభలు చాటి చెప్పనున్నాయి. రైతు పొలంలో పండించే ప్రతి గింజ వెనుక అతని శ్రమ, ఆశ, కుటుంబ భవిష్యత్తు దాగి ఉంటుంది. అదే విధంగా కూలీ చెమట చుక్కల్లో పట్టణాల నిర్మాణం, గ్రామాల అభివృద్ధి, సమాజ పురోగతి కనిపిస్తాయి. అందుకే రైతు, వ్యవసాయ కార్మికుడు, కూలీ సమస్యలను కేవలం ఒక వర్గానికి సంబంధించిన సమస్యలుగా కాకుండా సమాజం మొత్తం బాధ్యతగా చూడాల్సిన అవసరాన్ని ఈ మహాసభలు ముందుకు తీసుకురానున్నాయి. 29న జెండా ఆవిష్కరణ.. కీలక అంశాలపై చర్చ సెప్టెంబర్ 29న ఉదయం 9 గంటలకు జాతీయ అధ్యక్షుడి చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ జరుగుతుంది. అనంతరం ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ గోపినాథ్ ఆహ్వానం, ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి ప్రారంభోపన్యాసంతో మహాసభలు ప్రారంభమవుతాయి. సౌహార్ద ప్రతినిధుల సందేశాలు, జాతీయ కమిటీ పిలుపు, ఉద్యమ నిర్మాణంపై సమీక్ష, వివిధ తీర్మానాలు, భవిష్యత్ కర్తవ్యాలపై విస్తృతంగా చర్చించనున్నారు. అలాగే నూతన జాతీయ కార్యనిర్వాహక కమిటీని ఎన్నుకోనున్నారు. నేటి యువత సాంకేతికత, విద్య, ఉద్యోగాల వైపు వేగంగా అడుగులు వేస్తున్న తరుణంలో సమాజానికి అన్నం పెట్టే రైతు, సమాజ నిర్మాణంలో భాగస్వాములైన కూలీల జీవనాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. మన అభివృద్ధి వెనుక ఎవరి శ్రమ ఉందో గుర్తించడం, శ్రమించే మనిషిని గౌరవించడం, సమాజంలోని బలహీన వర్గాల పట్ల మానవీయతతో స్పందించడం ప్రతి యువకుడి సామాజిక బాధ్యతగా మారాల్సిన అవసరాన్ని ఈ మహాసభలు గుర్తుచేస్తున్నాయి. రైతు పొలంలో మొలిచే పంటలా, కూలీ చెమటతో ఎదిగే సమాజంలా, మనుషుల మధ్య పరస్పర గౌరవం, సహకారం, మానవత్వం పెరిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందనే సందేశాన్ని ఈ మహాసభలు ప్రజల్లోకి తీసుకెళ్లనున్నాయి. ప్రజా ప్రదర్శన, సభలకు మీడియా సహకారం కోరిన ఏఐకెఎంఎస్ సెప్టెంబర్ 28న నిర్వహించనున్న ప్రజా ప్రదర్శన, బహిరంగ సభలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కవర్ చేసి ప్రజలకు సమాచారం అందించాలని ఏఐకెఎంఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య, రాష్ట్ర అధ్యక్షులు యం. భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండారు ఐలయ్య, మండల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా అంతర్జాతీయ పర్యాటక దినోత్సవ వేడుకలు

**ఖమ్మం బ్యూరో , సెప్టెంబర్- 27(తెలంగాణ ముచ్చట్లు ):** స్థానిక లకారం ట్యాంక్ బండ్ ప్రాంగణంలో అంతర్జాతీయ పర్యాటక దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా అటవీ అధికారి అనూజ్ అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతర్జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన యువ స్కూల్, యువ కాలేజ్ పోటీల్లో గెలుపొందిన పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా అటవీ అధికారి బహుమతుల ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి అనూజ్ అగర్వాల్ మాట్లాడుతూ, జిల్లాలో అనేక పర్యాటక ప్రాంతాలు అయినా వెలుగుమట్ల అర్బన్ పార్క్, పులిగుండాల ఎకో టూరిజం, లకారం ట్యాంక్ బండ్, ఖమ్మం ఖిల్లా, నేలకొండపల్లి బౌద్ధ స్థూపం, వైరా, పాలేరు లాంటి రిజర్వాయర్లు పర్యాటకులకు ఆహ్లాదం ఇచ్చే విధంగా ఉన్నాయని తెలిపారు.

వేడుకల్లో కళాకారులు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వేడుకల్లో భాగంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే సంగీత విభావరి, న్యూ విజన్ హైస్కూల్ విద్యార్థిని భాగ్య సాన్వి బృందంచే శాస్త్రీయ స్వాగత నృత్యం, జాతీయ నృత్యకారిణి లక్షణ్యచే శాస్త్రీయ నృత్య ప్రదర్శన, టీజీఎస్ డబ్ల్యూడీసీ చెందిన శ్రీకళ అండ్ టీమ్ (10 మంది)చే జానపద మేళవింపు ( టీజీ డబ్ల్యూఆర్ఎస్ కుసుమంచికి చెందిన చిన్మయి బృందంచే సెమీ క్లాసికల్ డ్యాన్స్, దుర్గచే శాస్త్రీయ నృత్యం ప్రేక్షకులు ఎంతో ఉత్సాహంగా తిలకించారు.




ఈ వేడుకల్లో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, వివిధ శాఖల అధికారులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆప్యాయ పలకరింపులు





- **సామాన్యుడిలా బల్లపై కూర్చొని టీ తాగిన డిప్యూటీ సీఎం!**
- **ముదిగొండ టీ స్టాల్ వద్ద డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముచ్చట్లు**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 27(తెలంగాణ ముచ్చట్లు ):** అధికార గర్వం లేని ఆత్మీయత, ప్రజా నాయకుడికి ఉండాల్సిన నిజమైన నిరాడంబరత ముదిగొండ మండల కేంద్రంలో శనివారం ఆవిష్కృతమైంది. మధిర నియోజకవర్గ పర్యటనలో భాగంగా వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన హోదాను పక్కనబెట్టి, అత్యంత సాధారణ మానవుడిలా ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రజల మధ్యన గడిపారు.

ముదిగొండ సెంటర్‌లోని 'నీల్ కమల్ టీ స్టాల్' వద్ద కాన్వాయ్‌ను ఆపిన డిప్యూటీ సీఎం, అక్కడ ఉన్న బల్లపై కూర్చొని ప్రశాంతంగా టీ తాగారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి స్వయంగా తమ ముందుకు వచ్చి సామాన్యుడిలా టీ తాగుతుండడం చూసి స్థానికులు, ప్రయాణికులు ఆశ్చర్యానందాలకు లోనయ్యారు. ఆయనను చూసేందుకు, మాట్లాడేందుకు జనం పోటీ పడగా, యువత ఆయనతో సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం చూపారు. ప్రతి ఒక్కరినీ చిరునవ్వుతో పలకరిస్తూ భట్టి విక్రమార్క అందరి మనస్సులను గెలుచుకున్నారు.

**ప్రజా సంక్షేమంపై ప్రత్యక్ష ఆరా**

టీ స్టాల్ పరిసరాల్లో ఉన్న మహిళలను ఆప్యాయంగా పలకరించిన డిప్యూటీ సీఎం, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అనంతరం రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారి బానోతు రాంజీ, కూరగాయల వ్యాపారి నరసమ్మలను పలకరించి, ముదిగొండలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులపై అభిప్రాయం అడిగారు. "సార్, మునుపటి కంటే ఇప్పుడు రోడ్డు వెడల్పు కావడం మాకు ఎంతో ఆనందంగా ఉంది" అని నరసమ్మ సంతోషం వ్యక్తం చేశారు. కాగా, విస్తరణలో ఇండ్లు కోల్పోయామని కొందరు ఆయన దృష్టికి తేగా, "ఎవరూ ఆందోళన చెందవద్దు, ఇండ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరపున ఇండ్లు ఇస్తాం" అని భరోసా ఇచ్చారు.

రోడ్డు పక్కన చెప్పులు కుట్టుకునే పల్లె నాగభూషణంను డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా పలకరించి కులవృత్తి, కుటుంబ పోషణ గురించి అడిగారు. దుమ్ము ధూళితో ఇబ్బంది పడుతున్నానని, ఆర్థిక సహకారం అందిస్తే చిన్న డబ్బా ఏర్పాటు చేసుకుంటానని నాగభూషణం కోరగా... ఆయన కుమారుడు పల్లె సురేష్ పేరిట 'రాజీవ్ యువ వికాసం' కింద రూ. లక్ష వరకు రుణ సహాయం అందిస్తామని మాట ఇచ్చారు.

వెంకటాపురం గ్రామానికి చెందిన ఎంగ్రోటి యశోద అనే నిరుపేద మహిళ ఇద్దరు ఆడపిల్లలతో అద్దె ఇంట్లో పడుతున్న కష్టాలను వివరించగా, తక్షణమే స్పందించిన డిప్యూటీ సీఎం... రాబోయే 'ఇందిరమ్మ ఇండ్ల' జాబితాలో ఆమెకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేయాలని అక్కడే ఉన్న సర్పంచ్‌ను ఆదేశించారు.

**అభివృద్ధి పనుల ఆకస్మిక తనిఖీ**

అనంతరం ముదిగొండలో రూపుదిద్దుకుంటున్న 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సి హెచ్ సి ) నిర్మాణ పనులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, మిగిలిన పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దానితో పాటు పట్టణంలో శరవేగంగా జరుగుతున్న రోడ్డు వెడల్పు, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. ఒకే రోజు నియోజకవర్గ అభివృద్ధి పనులను సమీక్షిస్తూనే, మరోవైపు సామాన్య ప్రజల కష్టాలను ఆలకించి అక్కడికక్కడే పరిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీరుపై ముదిగొండ ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

# అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్.. అదిరిపోయే డీల్స్




**హైదరాబాద్, సెప్టెంబరు 27 (తెలంగాణ ముచ్చట్లు):** అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్2026కు ముందస్తు డీల్స్ అందుబాటులోకి వచ్చాయి. అమెజాన్ ఇండియాలో సామ్‌సంగ్, యాపిల్, సోనీ, నైక్ వంటి ప్రముఖ బ్రాండ్ల ఉత్పత్తులపై భారీ తగ్గింపులను అందిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్‌పై 80 శాతం వరకు, ఫ్యాషన్ ఉత్పత్తులపై 70 శాతం వరకు, గృహోపకరణాలపై 60 శాతం వరకు, నిత్యావసరాలపై 50 శాతం వరకు డిస్కౌంట్లు లభిస్తున్నాయి.

ఎస్‌బీఐ క్రెడిట్, డెబిట్ కార్డులతో పాటు ఈఎంఐ కొనుగోళ్లపై 10 శాతం తక్షణ తగ్గింపు అందిస్తున్నారు. ప్రైమ్ సభ్యులకు అదనంగా 10 శాతం వరకు ప్రయోజనాలు లభించనున్నాయి. అమెజాన్ పే ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డు వినియోగించే ప్రైమ్ సభ్యులకు 5 శాతం అపరిమిత నగదు వెనక్కి పొందే అవకాశం ఉంది. ఉచిత చేరికతో పాటు ప్రాసెసింగ్ ఫీజు లేని ఈఎంఐ సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

# ఎస్‌బీఐ డెబిట్ కార్డు వాడకపోయినా ఛార్జీలు.. ఇవిగో వివరాలు




**హైదరాబాద్, సెప్టెంబరు 27 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులు డెబిట్ కార్డు విషయంలో కొన్ని ఛార్జీలను తప్పక తెలుసుకోవాలి. డెబిట్ కార్డును పెద్దగా ఉపయోగించకపోయినా.. కార్డు రకాన్ని బట్టి వార్షిక నిర్వహణ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఎస్‌బీఐ అధికారిక సేవా రుసుముల వివరాల ప్రకారం.. ఈ వార్షిక నిర్వహణ ఛార్జీ రెండో సంవత్సరం ప్రారంభం నుంచి వసూలు చేస్తారు.

క్లాసిక్, సిల్వర్, గ్లోబల్, కాంటాక్ట్‌లెస్ డెబిట్ కార్డులకు ఏడాదికి రూ.200 ప్లస్ జీఎస్టీ వసూలు చేస్తున్నారు. యువ, గోల్డ్, కాంబో కార్డులకు రూ.250 ప్లస్ జీఎస్టీ, ప్లాటినమ్ కార్డుకు రూ.325 ప్లస్ జీఎస్టీగా ఉంది. మాస్టర్‌కార్డ్ వరల్డ్ డెబిట్ కార్డుకు రూ.800 ప్లస్ జీఎస్టీ వార్షిక నిర్వహణ రుసుం ఉంది. కొన్ని ప్రత్యేక ఖాతాలు, జీత ఖాతాలకు సంబంధించిన కార్డులకు మాత్రం వార్షిక నిర్వహణ ఛార్జీ మినహాయింపు ఉంటుంది.

డెబిట్ కార్డు పోయినప్పుడు కొత్త కార్డు తీసుకోవాలంటే ఎస్‌బీఐ రూ.300 ప్లస్ జీఎస్టీ రీప్లేస్‌మెంట్ రుసుం వసూలు చేస్తోంది. శాఖ ద్వారా పిన్ మళ్లీ పొందాలన్నా రూ.50 ప్లస్ జీఎస్టీ రుసుం ఉంటుంది. అంతేకాకుండా ఖాతాలో తగినంత నగదు లేకపోవడం వంటి కారణాలతో ఏటీఎం లేదా పీఓఎస్ లావాదేవీ సాంకేతికంగా విఫలమైతే రూ.20 ప్లస్ జీఎస్టీ ఛార్జీ వర్తిస్తుంది.

విదేశాల్లో లావాదేవీలకు ప్రత్యేక ఛార్జీలు

అంతర్జాతీయ లావాదేవీల విషయంలోనూ ప్రత్యేక రుసుములు ఉన్నాయి. ఎస్‌బీఐ అధికారిక వివరాల ప్రకారం.. విదేశాల్లో ఏటీఎం ద్వారా నగదు తీసుకుంటే కనీసం రూ.100తో పాటు లావాదేవీ మొత్తంపై 3.5 శాతం, జీఎస్టీ వర్తిస్తుంది. విదేశాల్లో పీఓఎస్ లేదా ఆన్‌లైన్ లావాదేవీలకు 3 శాతం, జీఎస్టీ వసూలు చేస్తారు. విదేశీ ఏటీఎంలో బ్యాలెన్స్ విచారణకూ రూ.25 ప్లస్ జీఎస్టీ రుసుం ఉంది.

ఏటీఎం ద్వారా నగదు ఉపసంహరణ, ఇతర లావాదేవీలకు ఖాతా రకం, సగటు బ్యాలెన్స్, ఏటీఎం రకాన్ని బట్టి ఉచిత పరిమితులు ఉంటాయి. ఆ పరిమితి దాటిన తర్వాత అదనపు రుసుములు వర్తించవచ్చు. అందువల్ల డెబిట్ కార్డు తీసుకునే ముందు దాని వార్షిక నిర్వహణ రుసుం, ఏటీఎం ఉచిత లావాదేవీల పరిమితి, ఇతర ఛార్జీల వివరాలను తెలుసుకోవడం మంచిది.

# అక్టోబర్ 1 నుంచి ఏసీలు, టీవీల ధరలు పెంపు

**హైదరాబాద్, సెప్టెంబరు 27 (తెలంగాణ ముచ్చట్లు):** పండుగ సీజన్ సమీపిస్తున్న వేళ ఎలక్ట్రానిక్స్ కొనుగోలు చేయాలనుకునే వారికి ధరల పెంపు రూపంలో షాక్ తగలనుంది. అక్టోబర్ 1 నుంచి ఏసీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఎల్‌ఈడీ టీవీల ధరలను 5 నుంచి 8 శాతం వరకు పెంచేందుకు ప్రముఖ కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాదిలో ఎలక్ట్రానిక్స్ ధరలు పెరగడం ఇది మూడోసారి కావడం గమనార్హం. ప్రపంచ మార్కెట్‌లో నెలకొన్న యుద్ధ వాతావరణం, పశ్చిమాసియా సంక్షోభం వంటి పరిణామాలతో ముడిసరుకుల ధరలు భారీగా పెరిగాయని తయారీ సంస్థలు చెబుతున్నాయి. ముఖ్యంగా రాగి ధరలు గణనీయంగా పెరగడం ఏసీల తయారీ వ్యయంపై ప్రభావం చూపుతోంది. గతంలో టన్ను రాగి ధర 8,000-9,000 డాలర్ల స్థాయిలో ఉండగా.. ప్రస్తుతం సుమారు 14,500 డాలర్లకు చేరినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఒక్క ఏసీ తయారీలోనే సుమారు 3 నుంచి 4 కిలోల వరకు రాగి అవసరమవుతుండటంతో ఉత్పత్తి ఖర్చులు పెరుగుతున్నాయి. బ్లూ స్టార్, గోద్రెజ్, హయర్ వంటి కంపెనీలు ఇప్పటికే కొన్ని ఉత్పత్తుల ధరలను సవరించినట్లు సమాచారం. చిన్న స్క్రీన్ టీవీల ధరలు 20 శాతం వరకు, పెద్ద స్క్రీన్ టీవీల ధరలు 10 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

దసరా నుంచి దీపావళి వరకు ఎలక్ట్రానిక్స్ విక్రయాలు సాధారణంగా పెరుగుతాయి. ఈ సమయంలో ధరలు పెరగడం అమ్మకాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే పలువురు డీలర్లు ఇప్పటికే పాత ధరలకు పెద్ద మొత్తంలో స్టాక్ కొనుగోలు చేసి ఉంచినట్లు తెలుస్తోంది. దీంతో దీపావళి వరకు కొన్ని ఉత్పత్తులు పాత ధరలకే లభించే అవకాశం ఉంది. ఆ తర్వాత కొత్త ధరల ప్రభావం వినియోగదారులపై పూర్తిగా పడే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఆర్టీఐ పరిధి నుంచి శాంతిభద్రతల విభాగం మినహాయింపు

- **గెజిట్ ఉత్తర్వులు జారీ చేసిన తమిళనాడు ప్రభుత్వం**
- **గూఢచార, భద్రతా సంస్థగా వర్గీకరణ**
- **పారదర్శకతపై వ్యక్తమవుతున్న ఆందోళనలు**
- **రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసిన నిర్ణయం**



**చెన్నై, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర పరిపాలనలో అత్యంత కీలకమైన శాంతిభద్రతల విభాగాన్ని సమాచార హక్కు చట్టం పరిధి నుంచి మినహాయిస్తూ తమిళనాడు ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. గూఢచార, భద్రతా సంస్థల జాబితాలో ఈ విభాగాన్ని చేర్చుతూ ప్రభుత్వం గెజిట్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ శాఖకు సంబంధించిన అనేక అంశాలపై సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు పొందే అవకాశాలు పరిమితమవుతాయని భావిస్తున్నారు. తమిళనాడు ప్రభుత్వం మానవ వనరుల నిర్వహణ శాఖ ద్వారా విడుదల చేసిన ఉత్తర్వుల్లో సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 24(4) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అధికారాలను వినియోగించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ నిబంధన ప్రకారం గూఢచార, భద్రతా కార్యకలాపాలు నిర్వహించే సంస్థలను సమాచార హక్కు చట్టం పరిధి నుంచి మినహాయించే అవకాశం రాష్ట్రాలకు ఉంటుంది. అదే అధికారాన్ని ఉపయోగించి శాంతిభద్రతల విభాగాన్ని ప్రత్యేక జాబితాలో చేర్చినట్లు వెల్లడించింది.

రాష్ట్రంలో మత ఘర్షణలు, సామాజిక ఉద్రిక్తతలు, రాజకీయ ఆందోళనలు, నిరసనలు, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన అంశాలను ఈ విభాగం పర్యవేక్షిస్తుంది. ప్రభుత్వ యంత్రాంగం తీసుకునే అనేక నిర్ణయాలు ఈ శాఖ ద్వారా అమలవుతుంటాయి. తాజా నిర్ణయంతో ఈ విభాగానికి సంబంధించిన సమాచారాన్ని పొందడంలో పరిమితులు ఏర్పడే అవకాశముందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నిర్ణయంపై పౌరసంఘాలు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టుల వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రజలకు సమాచారాన్ని తెలుసుకునే హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమని, ఇలాంటి నిర్ణయాలు పారదర్శకతపై ప్రభావం చూపవచ్చని కొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రజా పర్యవేక్షణ తగ్గే ప్రమాదం ఉందని కూడా వారు పేర్కొంటున్నారు.

మరోవైపు భద్రతా వ్యవహారాలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని రక్షించేందుకు ఇలాంటి చర్యలు అవసరమని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా కొన్ని వివరాలు బహిర్గతం కాకుండా ఉండటం అవసరమని వారు వాదిస్తున్నారు. భద్రతా అంశాలు ప్రజా ప్రయోజనాలకు సంబంధించినవని చెబుతున్నారు. అయితే సమాచార హక్కు చట్టంలోని నిబంధనల ప్రకారం అవినీతి ఆరోపణలు, మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన అంశాలు ప్రత్యేక పరిస్థితుల్లో పరిశీలనకు అవకాశం ఉండే విషయాన్ని నిపుణులు గుర్తుచేస్తున్నారు. మొత్తంగా తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పారదర్శకత, జవాబుదారీతనం, భద్రత అంశాలపై విస్తృత చర్చకు దారితీసింది.

# తరంగశక్తి–2026 వైమానిక విన్యాసాలు ప్రారంభం





- **జోధ్‌పూర్ వైమానిక స్థావరంలో కార్యాచరణ దశ ఆరంభం**
- **అక్టోబర్ 12 వరకు కొనసాగనున్న బహుళ దేశాల విన్యాసాలు**
- **ఏడు మిత్ర దేశాల వైమానిక దళాల భాగస్వామ్యం**
- **పరస్పర సహకారం, సమన్వయ సామర్థ్యాల పెంపే ప్రధాన లక్ష్యం**

**జోధ్‌పూర్, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** భారత వైమానిక దళం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'తరంగశక్తి-2026' బహుళ దేశాల వైమానిక విన్యాసాల కార్యాచరణ దశ జోధ్‌పూర్ వైమానిక స్థావరంలో ప్రారంభమైంది. సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 12 వరకు ఈ విన్యాసాలు జరగనున్నాయి. మిత్ర దేశాల మధ్య సమన్వయం, వ్యూహాత్మక సహకారం, సంయుక్త కార్యాచరణ సామర్థ్యాల పెంపు లక్ష్యంగా ఈ విన్యాసాలు నిర్వహిస్తున్నారు. 'భాగస్వామ్యంలో శక్తి' అనే భావనతో ఈ విన్యాసాలను చేపడుతున్నారు. పరస్పర అనుభవాల మార్పిడి, నైపుణ్యాల పంచుకోవడం, ఆధునిక కార్యాచరణ పద్ధతులను తెలుసుకోవడం ద్వారా వైమానిక దళాల మధ్య అనుసంధానం మరింత బలోపేతం చేయడమే ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ విన్యాసాల్లో ఆస్ట్రేలియా, అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఫ్రాన్స్, జర్మనీ, శ్రీలంక, బంగ్లాదేశ్ దేశాల వైమానిక దళాలు పాల్గొంటున్నాయి. వివిధ దేశాలకు చెందిన యుద్ధ విమానాలు, సాంకేతిక బృందాలు, వైమానిక సిబ్బంది ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతున్నారు. సంయుక్త శిక్షణ కార్యక్రమాలు, వ్యూహాత్మక విన్యాసాలు, వైమానిక యుద్ధ నైపుణ్యాల ప్రదర్శనలు ఈ కార్యక్రమంలో కీలకంగా ఉండనున్నాయి. క్లిష్ట పరిస్థితుల్లో సమర్థవంతంగా స్పందించే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణలు నిర్వహించనున్నారు. 2024లో విజయవంతంగా నిర్వహించిన తొలి తరంగశక్తి విన్యాసాల కొనసాగింపుగా ఈ ఏడాది కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నారు. వివిధ దేశాల వైమానిక దళాలకు పరస్పర అనుభవాలను పంచుకునే వేదికగా ఇది నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు. ప్రాంతీయ భద్రత, వ్యూహాత్మక భాగస్వామ్యాల బలోపేతం, వైమానిక దళాల మధ్య వృత్తిపరమైన అనుబంధాల పెంపులో తరంగశక్తి-2026 కీలక పాత్ర పోషించనుందని భారత వైమానిక దళం వెల్లడించింది. ఈ విన్యాసాలు అంతర్జాతీయ స్థాయిలో భారత వైమానిక దళం సామర్థ్యాలను ప్రదర్శించే అవకాశంగా కూడా నిలుస్తున్నాయి.

# రూ.5 లక్షల పెట్టుబడి.. రూ.10 లక్షలుగా మారే పోస్టాఫీస్ పథకం



**హైదరాబాద్, సెప్టెంబరు 27 (తెలంగాణ ముచ్చట్లు):** తక్కువ రిస్క్‌తో పొదుపు చేయాలనుకునేవారికి పోస్టాఫీస్ చిన్న మొత్తాల పొదుపు పథకాలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ) కూడా ఒకటి. ప్రభుత్వ మద్దతుతో నడిచే ఈ పథకంలో మార్కెట్ హెచ్చుతగ్గుల ప్రభావం లేకుండా నిర్ణీత వడ్డీ రేటు ప్రకారం రాబడి పొందే అవకాశం ఉంటుంది.

రూ.5 లక్షలు..రూ.10 లక్షలు

కిసాన్ వికాస్ పత్ర పథకం 1988లో ప్రారంభమైంది. ఇందులో కనీసం రూ.1,000 నుంచి పెట్టుబడి ప్రారంభించవచ్చు. గరిష్ఠ పెట్టుబడికి పరిమితి లేదు. ప్రస్తుతం ఈ పథకానికి 7.5 శాతం వార్షిక వడ్డీ రేటు వర్తిస్తోంది. ప్రస్తుత రేటు కొనసాగితే పెట్టుబడి 9 సంవత్సరాల 7 నెలల్లో రెట్టింపు అవుతుంది. అంటే రూ.5 లక్షలు పెట్టుబడి పెడితే మెచ్యూరిటీ సమయంలో రూ.10 లక్షలు అవుతాయి.

ఎవరు పెట్టుబడి పెట్టొచ్చు?

కేవీపీలో వ్యక్తిగతంగా పెట్టుబడి పెట్టడంతో పాటు ఇద్దరు కలిసి సంయుక్త ఖాతా తెరవొచ్చు. మైనర్ల పేరుతో తల్లిదండ్రులు లేదా సంరక్షకులు ఖాతా ప్రారంభించే అవకాశం ఉంది. అయితే ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐలు) ఈ పథకంలో పెట్టుబడి పెట్టేందుకు అర్హులు కాదు. సమీప పోస్టాఫీసు లేదా అర్హత ఉన్న బ్యాంకు ద్వారా అవసరమైన గుర్తింపు, చిరునామా తదితర ధ్రువీకరణ పత్రాలతో ఖాతా తెరవవచ్చు.

అవసరమైతే ముందే ఉపసంహరణ

కేవీపీ ఖాతాలో పెట్టుబడి పెట్టిన మొత్తాన్ని నిర్దిష్ట నిబంధనల ప్రకారం ముందుగానే ఉపసంహరించుకునే అవకాశం ఉంది. సాధారణంగా 2 సంవత్సరాల 6 నెలల తర్వాత కొన్ని షరతులతో ముందస్తు చెల్లింపుకు అవకాశం ఉంటుంది. ఖాతాను ఒక పోస్టాఫీసు నుంచి మరో పోస్టాఫీసుకు, అలాగే నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి నుంచి మరొకరికి బదిలీ చేయవచ్చు.

వడ్డీపై పన్ను వర్తింపు

కేవీపీలో చక్రవడ్డీ విధానంలో రాబడి లభిస్తుంది. ఈ పథకానికి వర్తించే వడ్డీ రేటును కేంద్ర ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తుంది. అందువల్ల భవిష్యత్తులో వడ్డీ రేటు మారే అవకాశం ఉంటుంది. కేవీపీపై సాధారణంగా మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్) ఉండదు. అయితే మెచ్యూరిటీ సమయంలో లభించే వడ్డీపై పెట్టుబడిదారుడి వర్తించే ఆదాయ పన్ను నిబంధనల ప్రకారం పన్ను బాధ్యత ఉండొచ్చు.

# హైవేలపై టోల్ ఇక ఆగకుండానే.. కొత్త విధానం




**హైదరాబాద్, సెప్టెంబరు 27 (తెలంగాణ ముచ్చట్లు):** దేశంలోని హైస్పీడ్ జాతీయ రహదారులపై ప్రయాణాన్ని మరింత వేగవంతం చేసేందుకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) కొత్త మార్గదర్శకాలను అమలు చేయనుంది. ఇకపై టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆగాల్సిన అవసరం లేకుండా 'మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో' టోలింగ్ విధానాన్ని తీసుకురానుంది. ఫాస్టాగ్, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ గుర్తింపు సాంకేతికతల ద్వారా వాహనం కదులుతుండగానే టోల్ రుసుం ఆటోమేటిక్‌గా వసూలు చేసే విధానం అందుబాటులోకి రానుంది.

ఇప్పటికే ప్రయోగాత్మకంగా అమలు

ఈ విధానాన్ని గుజరాత్‌లోని ఎన్‌హెచ్ 48పై ఇప్పటికే అమలు చేసినట్లు అధికారులు తెలిపారు. టోల్ ప్లాజాల వద్ద వాహనాలు బారులు తీరకుండా చేయడంతో పాటు ప్రయాణ సమయాన్ని తగ్గించడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశం. రాబోయే 4, 6 లేన్ల గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ యాక్సెస్ కంట్రోల్డ్ రహదారులకు కొత్త మార్గదర్శకాలు వర్తించనున్నాయి.

కృత్రిమ మేధతో రహదారుల నిర్మాణం

భవిష్యత్తులో పెరగనున్న ట్రాఫిక్‌ను ముందుగానే అంచనా వేసి రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకోసం ఆటోమేటెడ్, ఇంటెలిజెంట్ మెషిన్‌ఎయిడెడ్ నిర్మాణ సాంకేతికతను వినియోగించనున్నారు. దీంతో నిర్మాణ ప్రక్రియలో ఖచ్చితత్వం పెరగడంతో పాటు రహదారుల నాణ్యతను మెరుగుపరిచే అవకాశం ఉంటుంది.

కొత్త హైవే ప్రాజెక్టుల్లో పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రహదారుల మధ్య భాగాల్లో, వంతెనల కింద మొక్కలు పెంచడం, బిందు సేద్యం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడం, వర్షపు నీటిని నిల్వ చేసే వ్యవస్థలను ప్రాజెక్టు రూపకల్పనలోనే చేర్చడం వంటి చర్యలు చేపట్టనున్నారు. వేగవంతమైన ప్రయాణంతో పాటు ఆధునిక సాంకేతికత, రహదారి నాణ్యత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చేలా భవిష్యత్ జాతీయ రహదారులను తీర్చిదిద్దడమే ఎన్‌హెచ్‌ఏఐ లక్ష్యంగా పెట్టుకుంది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వచ్చే మార్చి కల్లా నిర్మాణాలు పూర్తిచేసి, అందుబాటులోకి తేవాలి...

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు





**ఖమ్మం బ్యూరో , సెప్టెంబర్- 27(తెలంగాణ ముచ్చట్లు ):** వచ్చే మార్చి కల్లా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాలు పూర్తిచేసి, అందుబాటులోకి తేవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం మధిర నియోజకవర్గం బోనకల్ మండలం లక్ష్మీపురం లో నిర్మాణం లో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను క్షేత్ర స్థాయిలో డిప్యూటీ సీఎం, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ లతో కలిసి పరిశీలించారు.

నిర్మాణాల్లో అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ స్ట్రక్చర్ నిర్మాణం పూర్తయిందన్నారు. ఆకాడమిక్ 3, 4 బ్లాకుల ఫ్రంట్, బ్యాక్ వింగ్ లు పూర్తయినట్లు, 1, 2 బ్లాకుల్లో బ్యాక్ వింగ్ పూర్తి అవగా, ఫ్రంట్ వింగ్ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. సీనియర్ హాస్టళ్లు 9 లో 3 హాస్టళ్లు పూర్తవగా, 2 హాస్టళ్ల నిర్మాణం పురోగతిలో ఉండగా, 4 హాస్టళ్ల నిర్మాణాలు బేస్ మెంట్ వరకు జరిగాయని అన్నారు. జూనియర్ 4 హాస్టళ్లకు సంబంధించి నిర్మాణాలు పూర్తయినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. పేరెంట్స్ వెయిటింగ్ హాల్ నిర్మాణం స్లాబ్ పూర్తయినట్లు, కిచెన్, డైనింగ్ హాల్ నిర్మాణాలు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు.

నిర్మాణ పనుల్లో ఎక్కడ ఆలస్యం అలసత్వం ఉండకూడదని గుత్తేదారులకు, అధికారులకు తెలిపారు. యంగ్ ఇండియా పాఠశాల పనులను మరింత వేగవంతం చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. నిర్మాణ కార్మికుల సంఖ్యను పెంచుకుని, పనులను మరింత వేగవంతం చేసి, మార్చి కల్లా పూర్తి స్థాయిలో పూర్తి చేయాలన్నారు.

నిర్మాణంలో ఉన్న తరగతి గదులను, హాస్టల్ సముదాయాలను, సైన్స్, కంప్యూటర్స్ ఇతర ల్యాబ్ భవనాలను డిప్యూటీ సీఎం పరిశీలించారు. కిచెన్, డైనింగ్ హాల్ లో జరుగుతున్న నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు, గౌరవం దక్కుతుందని, ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాముఖ్యత ఇస్తుందని డిప్యూటీ సీఎం అన్నారు. అక్షరమే ఆయుధంగా మలుచుకొని తెలంగాణ బిడ్డలు చదువుకొని బాగా ఎదగాలన్నారు. అక్షరం ద్వారానే అంతరాలు లేని సమాజం నిర్మాణ అవుతుందన్నారు. కుల, మత, వర్గ, ప్రాంత, ధనిక, పేద తారతమ్యాలు లేకుండా అందరూ ఒకేచోట చదువుకోవాలని లక్ష్యంతోనే ఈ పాఠశాలలను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం అన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఒకే చోట విద్యను అభ్యసిస్తే వసుధైక కుటుంబ భావన అందరిలోనూ ఏర్పడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, విద్యాశాఖ ఇఇ బుగ్గయ్య, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసా చారి, ఆర్ అండ్ ఎస్ ఈ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, సిపిఓ ఏ. శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి బాక్సింగ్ పతకం



**నాగోయా, సెప్టెంబరు 27 (తెలంగాణ ముచ్చట్లు):** ఆసియా క్రీడల్లో భారత బాక్సర్ అంకుష్ పంగల్ సత్తాచాటాడు. పురుషుల 80 కిలోల విభాగంలో అంకుష్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లి భారత్‌కు తొలి బాక్సింగ్ పతకాన్ని ఖాయం చేశాడు. ఆదివారం జరిగిన క్వార్టర్‌ఫైనల్‌లో తజికిస్థాన్‌కు చెందిన నెక్రుజ్ సలీమోవ్‌ను 50 తేడాతో ఓడించాడు.మ్యాచ్ ప్రారంభం నుంచే అంకుష్ దూకుడుగా బాక్సింగ్ చేశాడు. ప్రత్యర్థికి పెద్దగా అవకాశం ఇవ్వకుండా పంచ్‌లతో ఆధిపత్యం ప్రదర్శించాడు. మూడు రౌండ్లలోనూ మెరుగైన ప్రదర్శన కనబరిచి ఏకగ్రీవ నిర్ణయంతో విజయం సాధించాడు.ఆసియా క్రీడల్లో అంకుష్‌కు ఇదే తొలి ప్రదర్శన. తొలి ప్రయత్నంలోనే సెమీఫైనల్‌కు చేరి పతకం ఖాయం చేసుకోవడం విశేషం. గత నెల గ్లాస్గోలో జరిగిన కామన్వెల్త్ క్రీడల్లోనూ అంకుష్ స్వర్ణ పతకం సాధించాడు. వరుస అంతర్జాతీయ పోటీల్లో సత్తాచాటుతూ భారత బాక్సింగ్‌లో తన స్థానాన్ని మరింత బలపరుచుకున్నాడు.

# సింధుకు షాక్.. క్వార్టర్స్‌లోనే వీడ్కోలు



**నాగోయా, సెప్టెంబరు 27 (తెలంగాణ ముచ్చట్లు):** ఆసియా క్రీడలు 2026లో భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధుకు నిరాశ ఎదురైంది. మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో చైనాకు చెందిన చెన్ యూఫెయ్ చేతిలో 21తో ఓటమి పాలైంది. తొలి గేమ్‌ను గెలిచిన సింధు.. ఆ తర్వాత వరుసగా రెండు గేమ్‌లను కోల్పోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో సింధు ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా వరుసగా పాయింట్లు సాధిస్తూ తొలి గేమ్‌ను 2111తో సొంతం చేసుకుంది. దీంతో మ్యాచ్‌లో సింధుదే పైచేయిగా కనిపించింది.

రెండో గేమ్‌లో చెన్ యూఫెయ్ తన ఆటతీరును మార్చుకుంది. ఇరువురి మధ్య తీవ్ర పోటీ నెలకొనగా.. కీలక దశలో చైనా క్రీడాకారిణి వరుస పాయింట్లు సాధించింది. దీంతో 21 18తో రెండో గేమ్‌ను గెలుచుకుని మ్యాచ్‌ను సమం చేసింది.

మూడో గేమ్‌లోనూ చెన్ యూఫెయ్ ఆధిపత్యం కొనసాగింది. సింధుకు పుంజుకునే అవకాశం ఇవ్వకుండా 2110తో గేమ్‌ను గెలుచుకుని 21తో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. దీంతో సింధు ఆసియా క్రీడల్లో మహిళల సింగిల్స్ విభాగంలో క్వార్టర్‌ఫైనల్ దశలోనే నిష్క్రమించింది.

# వైభవ్‌పై జురెల్ ప్రశంసలు.. ‘వావ్’ అనాల్సిందే!



**హైదరాబాద్, సెప్టెంబరు 27 (తెలంగాణ ముచ్చట్లు):** 15 ఏళ్లకే సంచలనాలు సృష్టిస్తున్న యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీపై టీమిండియా యువ వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ ప్రశంసలు కురిపించాడు. వైభవ్ అసాధారణ ప్రతిభావంతుడని, అతనితో తనను పోల్చుకోవడానికి కానీ, అసూయ పడటానికి కానీ ఏమీ లేదని స్పష్టం చేశాడు.మాజీ భారత ఓపెనర్ ఆకాశ్ చోప్రా యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడిన జురెల్.. వైభవ్ ఆటతీరును కొనియాడాడు. 15 ఏళ్ల కుర్రాడు బౌలర్లను చితకబాదుతుంటే చూడటం అద్భుతంగా ఉంటుందని చెప్పాడు. వైభవ్‌కు లభిస్తున్న ప్రశంసలకు అతను పూర్తిగా అర్హుడని పేర్కొన్నాడు.వైభవ్‌తో తనకు ఎలాంటి అసూయ లేదని, పోల్చుకోవాల్సిన అవసరం కూడా లేదని జురెల్ తెలిపాడు. అతని ప్రతిభ సాధారణ అంచనాలకు అందనంత గొప్పదని, అతని ఆటను చూస్తే ‘వావ్’ అని మాత్రమే అనిపిస్తుందని వ్యాఖ్యానించాడు.పవర్‌ప్లేలో వైభవ్ ఆడే విధానం తమలోనూ స్ఫూర్తి నింపుతుందని జురెల్ చెప్పాడు భారత అండర్19 జట్టుతో పాటు ఐపీఎల్‌లోనూ తన ప్రతిభను చాటుకున్న అతను.. రాజస్థాన్ రాయల్స్ తరపున జురెల్‌తో కలిసి ఆడుతున్నాడు.ఇటీవల భారత సీనియర్ జట్టులోకి అరంగేట్రం చేసిన వైభవ్.. జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో తనదైన ముద్ర వేశాడు. సిరీస్‌లో అద్భుతంగా రాణించి ‘ప్లేయర్ ఆఫ్ ది సిరీస్’గా నిలిచాడు. దీంతో ఈ యువ ఆటగాడి ప్రతిభపై ప్రశంసలు మరింత పెరిగాయి.

# స్క్వాష్‌లో భారత్‌కు రెండు రజతాలు



**నాగోయా, సెప్టెంబరు 27 (తెలంగాణ ముచ్చట్లు):** ఆసియా క్రీడల్లో భారత స్క్వాష్ క్రీడాకారులు సత్తాచాటారు. మహిళల సింగిల్స్‌లో అనాహత్ సింగ్, పురుషుల సింగిల్స్‌లో అభయ్ సింగ్ రజత పతకాలు సాధించారు. దీంతో ఒకే ఆసియా క్రీడల ఎడిషన్‌లో పురుషుల, మహిళల సింగిల్స్ విభాగాల్లో భారత్ రజతాలు గెలుచుకోవడం ఇదే తొలిసారి. 18 ఏళ్ల అనాహత్ సింగ్ మహిళల సింగిల్స్ ఫైనల్‌లో మలేసియాకు చెందిన శివశంగరి సుబ్రహ్మణ్యం చేతిలో 411, 411, 711తో ఓటమి పాలైంది. దీంతో రజత పతకంతో సరిపెట్టుకుంది. అయినప్పటికీ ఆసియా క్రీడల మహిళల సింగిల్స్‌లో రజతం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది.ఇప్పటివరకు భారత స్క్వాష్ దిగ్గజాలు దీపికా పల్లికల్, జోష్నా చిన్నప్ప మహిళల సింగిల్స్‌లో కాంస్య పతకాలకే పరిమితమయ్యారు. తాజాగా అనాహత్ వారి రికార్డును అధిగమించి రజతం సాధించింది. పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో అభయ్ సింగ్ మలేసియాకు చెందిన ఎన్‌గ్ ఈన్ యో చేతిలో 03తో ఓటమి చవిచూశాడు. 911, 511, 511తో వరుస గేముల్లో పరాజయం పాలై రజత పతకాన్ని అందుకున్నాడు. అయితే ఆసియా క్రీడల పురుషుల సింగిల్స్‌లో ఫైనల్‌కు చేరిన రెండో భారత స్క్వాష్ క్రీడాకారుడిగా అభయ్ రికార్డు నెలకొల్పాడు.




Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in